గురువారం
15-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 234
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

క్రూయిజ్ క్షిపణలు ప్రయోగించిన ఉ.కొరియా

సియోల్: ఉత్తర కొరియా బుధవారం జపాన్ సముద్రం దిశగా తూర్పు తీరంలో కొన్ని క్రూయిజ్ క్షిపణలు ప్రయోగించింది. ఈ మేరకు దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ (జేసీఎస్) ప్రకటించినట్లు దక్షిణ కొరియా వార్తా సంస్థ 'యోన్హాప్' నివేదించింది. ఉదయం 9 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) ఉత్తర కొరియా పోర్టు నగరమైన వోన్‌సాన్ వైపు నుంచి కొన్ని క్షిపణలు దూసుకెళ్లినట్లు జేసీఎస్ గుర్తించిందని వార్తా నివేదిక తెలిపింది. ఉత్తర కొరియా కవ్వింపులపై అమెరికాతో కలిసి సియోల్ సైన్యం నిశిత నిఘా పెట్టిందని పేర్కొంది. పర్యవేక్షణ, నిఘా వ్యవస్థలను బలపర్చుకుంటున్నదని తెలిపింది. క్రూయిజ్ మిసైళ్లను ఉత్తర కొరియా ప్రయోగించడం ఈ ఏడాదిలో ఇది ఐదవ సారిగా యోన్హప్ వెల్లడించింది.

రాజ్యసభకు ఏకగ్రీవమే

పోటీకి టీడీపీ దూరం

ఊపిరిపీల్చుకున్న వైసీపీ అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజ్యసభ ఎన్నికల ఉత్కంఠకు తెరపడింది. తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించింది. దీంతో వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సుగమమైంది. ఉండవల్లి నివాసంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలతో బుధవారం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్టీ ముఖ్య నేతలు యనమల రామకృష్ణుడు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, కంభంపాటి రామ్మోహన్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. రా... కదలిరా, లోకేశ్ శంఖారావం సభలతో పాటు వివిధ రాజకీయ అంశాలపై వారితో చర్చించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ అంశంపై చంద్రబాబు వద్ద పార్టీ నాయకులు ప్రస్తావించగా... ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని పోటీకి నిలబెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఈనెల 15వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుంది. వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అయితే టీడీపీ అభ్యర్థిని పోటీకి దింపితే వైసీపీ క్యాంపు రాజకీయాలు నిర్వహించే పరిస్థితి ఉత్పన్నమవుతుందని, పోలింగ్ జరిగే వరకు ఒత్తిడి తప్పదని అభ్యర్థులు ఆందోళన చెందారు.

వాస్తవానికి శాసనసభలో సభ్యుల సంఖ్యాబలం ఆధారంగా ఈ మూడు స్థానాలూ వైసీపీ సునాయాసంగా గెలుచుకుంటుంది. ఒక్కో రాజ్యసభ సభ్యుడు గెలవాలంటే 44 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. వైసీపీకి ప్రస్తుతం సభలో 151 మంది ఉన్నారు. టీడీపీకి పోటీ చేయడానికి సరిపడా బలం లేదు. ప్రస్తుతం సభలో 18 మంది సభ్యుల బలం మాత్రమే ఉంది. అయితే గతంలో వైసీపీ రెబల్ ఎమ్మెల్యేల సహకారంతో టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించడంతో... మరలా అటువంటి పరిస్థితులు

- మిగతా 2 లో

వైసీపీకి ఇంటి పోరు

నెల్లూరు నేతల దారే వేరు

- అసంతృప్తిలో వేమిరెడ్డి
- ఒంగోలు పంచాయితీ కొలిక్కి
- ఎట్టకేలకు బాలినేని, చెవిరెడ్డి భేటీ
- నరసరావుపేటకు ర్యాలీగా అనిల్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అధికార పార్టీ వైసీపీలో అసంతృప్తి రగులుతూనే ఉంది. ఒక జిల్లాలో సమస్యలు సర్దుకున్నాయనుకునే లోపే మరో జిల్లాలో ముసలం పుడుతోంది. ఇంతకాలం ఒంగోలు జిల్లాలో అసంతృప్తులు అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారాయి. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి విభిన్న వ్యాఖ్యలతో పార్టీ అధిష్ఠానాన్ని ఇరకున పెడుతూ వస్తున్నారు. ప్రధానంగా ఒంగోలు ఎంపీ టికెట్‌ను మాంగుటకు ఇవ్వాలని ఒత్తిడి తేవడంతో పాటు తనకు తెలియకుండా ఎమ్మెల్యేల అభ్యర్థులను ఖరారు చేయడంపై అలక వహించారు. దీనిపై సీఎం జగన్ సమక్షంలో దఫ దఫాలుగా చర్చలు జరిగినా ఆయన అసంతృప్తి వీడలేదు. దానికితోడు ఒంగోలు పార్లమెంటరీ ప్రాంతీయ ఇన్‌చార్జిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమించడంపై ఆయన తీవ్ర వ్యతిరేకత చూపినట్లుగా ప్రచారముంది. ఎట్టకేలకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని ఇంటికి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెళ్లడం, వారిద్దరు కలిసి ఒకే కారులో ప్రయాణించి దర్శి నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించడంతో దాదాపుగా అక్కడ అసంతృప్తులకు తెరపడినట్లయింది. అయితే మళ్లీ నెల్లూరు పంచాయితీ తెరపైకి వచ్చింది. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అలక వహించారు. కొన్నిరోజులుగా ఆయన పార్టీ అధిష్ఠానానికి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. నెల్లూరు పట్టణ ఎమ్మెల్యే సీటును ముస్లిం సామాజిక వర్గానికి ఇటీవల వైసీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. తనకు తెలియకుండా అభ్యర్థిని నియమించడంపై వేమిరెడ్డి అసంతృప్తిగా ఉన్నారు. అటు నెల్లూరు రూరల్ వైసీపీ అభ్యర్థిగా ఉన్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సైతం పార్టీని వీడుతున్నట్లుగా ప్రచారం రాగా... వాటిని ఆయన తిప్పికొట్టారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పార్టీని వీడే ప్రసక్తి లేదని ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇప్పటికే నెల్లూరు నుంచి ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వైసీపీ అనర్హత వేటు వేసింది. నెల్లూరు పట్టణ ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్‌యాదవ్‌ను నరసరావుపేట ఎంపీగా బరిలో నిలిపింది. గత ఎన్నికల్లో ఎంతో బలంగా ఉన్న పార్టీ రాబోయే ఎన్నికల్లో పట్టు నిలుపుకుంటుందా అని నేతలు ఆందోళనకు గురవుతున్నారు.

అనిల్‌కుమార్‌కు భారీ స్వాగతం

నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా నియుక్తులైన పీ అనిల్‌కుమార్ యాదవ్ తన అనుచరులతో కలిసి భారీగా కార్ల ర్యాలీతో తరలివచ్చారు. నరసరావుపేటలో ఆయనకు భారీగా వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన జంగా కృష్ణమూర్తి అధిష్ఠానంపై ఇంకా ఆగ్రహంతో ఉన్నారు. ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోవడంపై అసంతృప్తి వీడలేదు. టీడీపీ నేతలతో జంగా కృష్ణమూర్తి టచ్‌లో ఉన్నప్పటికీ, అక్కడ కూడా టికెట్‌పై ఆయనకు స్పష్టత ఇవ్వకపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి ప్రకాశంజిల్లా పర్చూరు ఇన్‌ఛార్జిగా నియమించిన ఆమంచి అసంతృప్తితో ఉన్నారు. తనను పాత నియోజకవర్గం చీరాలకు మార్చాలంటూ అధిష్ఠానానికి ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు. చీరాలలో ఎమ్మెల్యే కరణం బలరామమూర్తి...తనయుడిని బరిలోకి దించారు. దీంతో ఈ రెండు స్థానాల అభ్యర్థుల మార్పులు,

- మిగతా 2 లో

అక్రమ తవ్వకాలపై

హైకోర్టు ఆగ్రహం

ఆపకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వెలిబుచ్చింది. అక్రమ మైనింగ్‌పై అనేక పిటిషన్లు వస్తున్నాయని ధర్మాసనం పేర్కొంది. వీటిని అధికారులు తక్షణమే ఆపకపోతే తామే తగిన చర్యలు తీసుకుంటామని కోర్టు హెచ్చరించింది.

చిత్తూరు జిల్లాలో అక్రమ మైనింగ్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. అక్రమ మైనింగ్‌పై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని హైకోర్టులో శెట్టిప్పం తంగల్ సర్పంచ్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజల ఫిర్యాదులను పట్టించుకోకుండా పాలకుల మద్దతుతో రాష్ట్రంలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారాలను పిటిషనర్ తరుపు న్యాయవాది నర్రా శ్రీనివాసరావు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో చిత్తూరులో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో పరిస్థితి ఇలానే ఉందంటూ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోకుంటే మైనింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చిరిస్తూ, తదుపరి విచారణను హైకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది.

రాజ్యసభకు సోనియా

నామినేషన్

జైపూర్: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు బుధవారం నామినేషన్ వేశారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సోనియాగాంధీ త్వరలోనే లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజ్యసభకు నామినేషన్ వేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. గాంధీలకు కంచుకోటగా ఉన్న రాయబరేలి నుంచి సోనియాగాంధీ స్థానంలో ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారి లోక్‌సభకు పోటీ చేయనున్నట్టు సమాచారం. సోనియాగాంధీ రాజ్యసభకు నామినేషన్ వేసిన సందర్భంగా ఆమె వెంట రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్, పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ డోటస్ర, అసెంబ్లీలో విపక్ష నేత టికారాం జులీ తదితరులు హాజరయ్యారు. నామినేషన్ వేయడానికి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

తగ్గని రైతన్న

దిల్లీ చలో మరింత ఉధృతం

- సరిహద్దులకు వేలాదిగా రైతులు
- అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- అన్నదాతలపై మళ్లీ బాష్పవాయువు
- ఎటు చూసినా బారికేడ్లు...ముళ్లకంచెలు... కందకాలు
- వెనకడుగు వేయబోమన్న రైతు సంఘాలు
- చర్చలకు సిద్ధమన్న కేంద్రం

న్యూదిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయడం సహా ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాలు పిలుపునిచ్చిన 'దిల్లీ చలో' ఆందోళన ఉధృతమవుతోంది. వేల సంఖ్యలో రైతులు దిల్లీలో ప్రవేశించేందుకు పంజాబ్, హరియాణ సరిహద్దులకు తరలివస్తున్నారు. మరో వైపు వారిని అడ్డుకునేందుకు అంతే స్థాయిలో పోలీసులు, భద్రతా బలగాలు మోహరించాయి. మంగళవారం అర్ధరాత్రి ఆందోళనకు విరామం ఇచ్చిన రైతు సంఘాలు రెండో రోజు బుధవారం తిరిగి దిల్లీలో అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. వారంతా దేశ రాజధానికి 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న శంభు సరిహద్దు నుంచి ముందుకు చొచ్చుకొచ్చేందుకు ప్రయత్నించగా... రైతులపై మరోసారి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడం, బారికేడ్ల ముందు ఉన్న కొంతమంది రైతు నిరసనకారులు రాళ్లు రువ్వడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. హరియాణా పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారని రైతులు పేర్కొన్నారు. మరోవైపు రైతుల నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. హరియాణా నుంచి నగరంలోకి ప్రవేశించే మార్గంలో పెద్ద ఎత్తున సిమెంట్ బారికేడ్లను ఏర్పాటు చేశారు. కొన్ని మార్గాల్లో వాహన రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రైతులను అడ్డుకునేందుకు కాంక్రీటు దిమ్మెలు, ఇనుప కంచెలు, మేకులు, కంటైనర్ల గోడలతో బహుళ అంచెల్లో బారికేడ్లను పెట్టారు. రహదారుల దిగ్బంధంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక చోట్ల కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోయాయి. నిరసనకారులపై బాష్పవాయువు ప్రయోగించేందుకు వాడే డ్రోన్లు పంజాబ్ భూభాగంలోకి రావడంపై ఆ రాష్ట్ర అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు పటియాలా డిప్యూటీ కమిషనర్ షౌకత్ అహ్మద్... అంబాలా డీసీకి లేఖ రాశారు. శంభు సరిహద్దుల్లో డ్రోన్లు తమ భూభాగంలోకి రానీయొద్దని తేల్చి చెప్పారు. ప్రస్తుతానికైతే డ్రోన్ల కదలికలు ఆగిపోయాయని అహ్మద్ బుధవారం వెల్లడించారు. కాగా మంగళవారం దిల్లీ సరిహద్దుకు చేరుకున్న రైతులు అర్ధరాత్రి రాత్రంతా రోడ్లపైనే గడిపారు. ఆందోళనల్లో పాల్గొనేందుకు వచ్చిన వారి కోసం బుధవారం ఉదయం టీ, అల్పాహారాన్ని సిద్ధం చేశారు. ప్రభుత్వం ఎలాంటి చర్యలకు ఉపక్రమించినా, తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని రైతు సంఘాల నాయకులు స్పష్టం చేశారు. అయితే, రైతులు కొత్త డిమాండ్లు చేస్తున్నారని, వాటిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం పడుతుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగించొద్దని వారికి విజ్ఞప్తి చేశారు. కాగా ఆందోళనల్లో పాల్గొనేందుకు మరింత మంది రైతులు రానున్నారనే సమాచారంతో భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. పంజాబ్, హరియాణా సరిహద్దులతో పాటు

- మిగతా 2 లో

నేడు కేంద్రంతో చర్చలు

అప్పటివరకు శాంతంగా ఉంటాం...

రైతు నాయకుల ప్రకటన

చండీగఢ్: కేంద్ర ప్రభుత్వంతో గురువారం సాయంత్రం 5గంటలకు చర్చలు జరపనున్నట్లు రైతు నాయకుడు సర్వన్ సింగ్ పంథేర్ ప్రకటించారు. చండీగఢ్‌లో ఈ సమావేశం జరగనుంది. చండీగఢ్‌లో బుధవారం సీనియర్ పోలీసు అధికారులతో సమావేశం అనంతరం పంథేర్ మాట్లాడుతూ... కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా, ఆహారశాఖ మంత్రి పీయూష్ గోయల్, హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సాయంత్రం 5 గంటలకు నగరంలో నిరసన తెలుపుతున్న రైతు ప్రతినిధులతో

- మిగతా 2 లో

మే 13 నుంచి ఏపీ ఈఏపీసెట్

ఏపీ ఉమ్మడి ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ఉమ్మడి ప్రవేశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఇంజినీరింగ్‌తోపాటు వివిధ సెట్ తేదీల వివరాలను ఖరారు చేసింది. ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఏపీ ఈఏపీసెట్) కోర్సులో ఉమ్మడి ప్రవేశ పరీక్షలను మే 13 నుంచి 19 వరకు నిర్వహిస్తారు. ఏపీ ఈఏపీసెట్ (జేఎన్టీయూ-కాకినాడ), ఐసెట్, ఈసెట్, ఏపీ ఎడ్‌సెట్ తదితర ఎనిమిది ప్రవేశ పరీక్షల తేదీలు, వాటిని నిర్వహించే విద్యా సంస్థల వివరాలిలా ఉన్నాయి. పీఈసెట్ పరీక్ష తేదీని ప్రకటించాల్సి ఉంది. ఏపీ ఈఏపీసెట్ (జేఎన్టీయూ-కాకినాడ) మే 13 నుంచి 19 వరకు, ఈసెట్ (జేఎన్టీయూ-అనంతపురం) మే 8, ఐసెట్ (శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ- అనంతపురం) మే 6, పీజీ ఈసెట్ (శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ-తిరుపతి) మే 29 నుంచి 31 వరకు, ఎడ్‌సెట్ (ఆంధ్రా యూనివర్సిటీ-విశాఖపట్నం) జూన్ 8, లాసెట్ (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ-గుంటూరు) జూన్ 9, పీఈసెట్ (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ-గుంటూరు) ఇంకా తేదీని ప్రకటించలేదు. పీజీ సెట్ (ఆంధ్రా యూనివర్సిటీ-విశాఖపట్నం) జూన్ 3 నుంచి 7 వరకు, ఏడీ సెట్-ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ) జూన్ 13న నిర్వహిస్తున్నట్టు షెడ్యూల్‌లో వివరించారు.

కేజ్రీవాల్‌కు ఆరోసారి ఈడీ సమన్లు

న్యూదిల్లీ: మనీలాండరింగ్ కేసులో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు ఆరోసారి జారీ అయ్యాయి. ఈనెల 19న విచారణకు హాజరు కావాలని ఆప్ కన్వీనర్‌ను దర్యాప్తు సంస్థ బుధవారం ఆదేశించింది. ఈడీ సమన్లు ధిక్కరించిన వ్యవహారంలో ఈనెల 17న విచారణకు హాజరు కావాలని దిల్లీ కోర్టు ఆయనకు ఇంతకుముందు సూచించింది. తాజాగా మళ్లీ సమన్లు జారీ కావడంతో ఆయన 19న విచారణకు హాజరు కావాల్సి ఉంది. కాగా, 2023 నవంబరు 2, డిసెంబరు 21, 2024 జనవరి 3, జనవరి 18, ఫిబ్రవరి 2వ తేదీల్లోనూ కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ అయ్యాయి. ఎక్సైజ్ కుంభకోణం వ్యవహారంలో కేజ్రీవాల్‌తో పాటు ఇతరుల పాత్రపై ఆరా కోసం అనేకసార్లు సమన్లు జారీ చేశామని ఈడీ ఫిర్యాదు పేర్కొంది. కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా విచారణకు రాలేదని, సమన్లు ధిక్కరిస్తున్నారని ఆరోపించింది. ఆయనకు ఆరోసారి సమన్లు జారీ చేసినట్లు తెలిపింది. ఈ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్లలోనూ కేజ్రీవాల్ పేరు అనేకసార్లు ప్రస్తావించారు. ప్రస్తుతం రద్దు అయిన దిల్లీ ఎక్సైస్ విధానం 2021-22 రూపొందించే సమయంలో కేజ్రీవాల్‌తో నిందితులు సంప్రదింపులు జరిపినట్లు ఈడీ ఆరోపించింది. ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తో పాటు కొందరు వ్యాపారవేత్తలను ఈడీ అరెస్టు చేసిన విషయం విదితమే. కాగా, ఈడీ నోటీసులను అక్రమమైనవిగా కేజ్రీవాల్ అనేక సార్లు ఆరోపించారు.

సంకీర్ణానికి రంగం సిద్ధం

పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య అవగాహన

2 లో

సంకీర్ణానికి రంగం సిద్ధం

- పీఎంఎల్-ఎన్, పీపీపీ మధ్య అవగాహన
- ప్రధాని రేసులో షెహబాజ్
- నామినేట్ చేసిన నవాజ్ పార్టీ
- పీటీఐతో పొత్తుకు జేఐ తిరస్కృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటునకు రంగం సిద్ధమైంది. మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వ పీఎంఎల్-ఎన్ పూనుకుంది. ఇదే క్రమంలో పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, పాకిస్థాన్ ముస్లిం లీగ్ నవాజ్ తరపున నవాజ్ షరీఫ్, షెహబాజ్ షరీఫ్ మంగళవారం ఇస్లామాబాద్‌లో భేటీ అయి ప్రభుత్వం ఏర్పాటు గురించి చర్చించారు. తమ మధ్య అవగాహన కుదిరినట్లు ప్రకటించారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన షెహబాజ్ తెలిపారు. పీపీపీ, పీఎంఎల్-ఎన్ కావాల్సిన సంఖ్యాబలమున్నట్లు వెల్లడించారు. అదే సమయంలో ప్రధాని రేసులో షెహబాజ్ షరీఫ్ ఉన్నట్లు పీఎంఎల్-ఎన్ పేర్కొంది. ఆయన పేరును పార్టీ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ ప్రతిపాదించినట్లు తెలిపింది. నవాజ్ మళ్లీ ప్రధాని అవుతారని అంతా భావించిన సమయంలో ఆయన తన సోదరుడిని నామినేట్ చేయడం ఆసక్తికరంగా మారింది. పీఎంఎల్-ఎన్ అధ్యక్షుడు నవాజ్ షరీఫ్ (74) తన తమ్ముడు షెహబాజ్ షరీఫ్ (72)ను ప్రధాని అభ్యర్థిగా నామినేట్ చేశారని, కుమార్తె మరియం నవాజ్ (50)ను పంజాబ్ ముఖ్యమంత్రిగా ప్రతిపాదించినట్లు పార్టీ అధికార ప్రతినిధి మరియం ఔరంగజేబ్ 'ఎక్స్'లో వెల్లడించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మద్దతిచ్చిన పార్టీలకు నవాజ్ కృతజ్ఞతలు తెలిపారని, సమ్మిళిత కృషితో పాకిస్థాన్‌ను సంక్షోభంలో నుంచి బయటకు తేగలుగుతామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇదిలావుంటే పీపీపీ కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ (సీఈసీ) సమావేశం అనంతరం బిలావల్ భుట్టో జర్దారీ (35) విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సంఖ్యాబలం తమ పార్టీకి లేనందున ప్రధాని రేసులో ఉండనని చెప్పారు.

ముత్తహిదా క్వామి మూవ్‌మెంట్-పాకిస్థాన్ (ఎంక్యూఎం-పీ)తోనూ పీఎంఎల్-ఎన్ చర్చలు జరిపింది. కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రెండు పార్టీలు నిర్ణయించాయి. ఎంక్యూఎం-పీకి 17మంది ఎంపీలు ఉన్నారు.

అయితే పీటీఐ మాత్రం తమతో కలిసి ముందుకెళ్లేందుకు ఒప్పుకోలేదని, సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు తిరస్కరించిందని బిలావల్ వెల్లడించారు. రాజకీయ సుస్థిరతకు తాము కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. ఆసిఫ్ అలీ జర్దారీ (68) మరోమారు అధ్యక్షుడు కావాలని బిలావల్ ఆకాంక్షించారు. 'ఆయన నాకు తండ్రి కాబట్టి ఇలా అనడం లేదు. మన దేశం తీవ్ర సంక్షోభంలో చిక్కుకొని ఉంది. దానిని చక్కబెట్టే సామర్థ్యం ఉన్న నాయకుడు ఆసిఫ్ అలీ జర్దారీ' అని నొక్కిచెప్పారు. విభజన రాజకీయాలకు ముగింపు పలికి దేశం గురించి ఆలోచించాలని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. అయితే మజ్లిస్ వహదత్ ఏ ముస్లిమీన్ (ఎండబ్ల్యూఎం)తో కలిసి కేంద్రంతో పాటు పంజాబ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పీటీఐ కసరత్తు చేస్తోంది. ఖైబర్ పఖ్తుంఖ్వాలో జమాతే ఇస్లామీ(జేఐ)తో పొత్తుకు యత్నించగా ఆ పార్టీ ఒప్పుకోలేదు. చివరి నిమిషంలో పీటీఐ మాట మర్చినందునే పొత్తును తిరస్కరించినట్లు జేఐ తెలిపింది. ఈ పార్టీలు కలిసినా ప్రభుత్వం ఏర్పాటుకు కావల్సిన సంఖ్యాబలం లేదని తెలుస్తోంది. పీటీఐ మద్దతున్న అభ్యర్థులు దాఖలు చేసిన 30 పిటిషన్లను లాహోర్ హైకోర్టు తిరస్కరించడంతో ఆ పార్టీకి ఎదురు దెబ్బ తగిలినట్లు అయ్యింది. తమ సమస్యలను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లాలని కోర్టు సూచించింది.

మొత్తం 266 సభ్యులున్న నేషనల్ అసెంబ్లీలో 265 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 133 స్థానాలు గెలుచుకోవాలి. కానీ ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదు. పీటీఐ మద్దతున్న అభ్యర్థులు 101 స్థానాలను గెలుచుకున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. కాగా, పీఎంఎల్-ఎన్‌కు 75, పీపీపీకి 54, ఎంక్యూఎం-పీకి 17 స్థానాలు వరించాయి.

రాజ్యసభకు సోనియా నామినేషన్

(మొదటిపేజీ తరువాయి)

ముందు పార్టీ ఎమ్మెల్యేలతో అసెంబ్లీలోని విపక్ష లాబీలో సోనియాగాంధీ సమావేశమయ్యారు. రాజ్యసభ ఎన్నికలు, తన అభ్యర్థిత్వానికి మద్దతుపై ఆమె చర్చించారు. రాజస్థాన్ నుంచి 3 రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక సీటు సులభంగా గెలుచుకోగలిగే స్థితిలో ఉంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆరేళ్ల రాజ్యసభ పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుండటంతో సోనియాగాంధీ ఆ స్థానంలో పోటీ చేస్తున్నారు. ఆమె ఇప్పటి వరకూ ఐదుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించగా, రాజ్యసభకు గెలిస్తే ఇదే మొదటిసారి అవుతుంది. 77వ పడిలో పడిన సోనియాగాంధీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపలేదు.

తగ్గని రైతన్న

(మొదటిపేజీ తరువాయి)

దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా భద్రతా బలగాలను మోహరించారు. సరిహద్దుల వద్ద మరిన్ని కాంక్రీటు దిమ్మెలు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. డ్రోన్లతో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. శంభు సరిహద్దు గ్రామాల మీదుగా పెద్ద వాహనాలు వెళ్లకుండా అధికారులు రోడ్డుపై భారీ కందకాలు తవ్వారు.

ఇంటర్నెట్ బంద్

రైతుల ఆందోళనల నేపథ్యంలో హరియాణాలోని అంబాలా, కురుక్షేత్ర, కైతాల్, జింద్, హిసార్, ఫతేహాబాద్, సిర్సా జిల్లాల్లో వాయిస్ కాల్స్‌ల మినహా మిగతా అన్నీ మొబైల్ సేవలను ఫిబ్రవరి 15 వరకు నిలిపివేశారు అధికారులు. మరోవైపు రైతుల డిమాండ్ల అంశాన్ని తీవ్రమైనదిగా పరిగణించి పరిష్కార మార్గాలు చూపే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి బుధవారం డిమాండ్ చేశారు.

పతంగులు ఎగరేస్తున్న రైతులు

పంజాబ్-హరియాణా సరిహద్దుల వద్ద రైతులు పతంగులు ఎగురవేస్తున్నారు. ఎందుకంటే మంగళవారం రైతు నిరసనకారులు బారికేడ్లు దాటడానికి ప్రయత్నించినప్పుడు వారిపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. శంభు సరిహద్దు ప్రాంతం పంజాబ్‌లోనే ఉన్నప్పటికీ హరియాణా నుంచి డ్రోన్ ద్వారా దీనిని ప్రయోగిస్తున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రైతులు శంభు సరిహద్దుల్లో డ్రోన్లు ఎగరకుండా పంతగులు ఎగురవేస్తున్నారు. అవసరమైతే డ్రోన్లను కిందకు దించేందుకు పట్టుదలగా ఉన్నారు.

దిల్లీలో ట్రాఫిక్ ఆంక్షలు

దిల్లీ చలో కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన రైతులు బుధవారం నిరసనలు తెలుపుతామని ప్రకటించిన నేపథ్యంలో దిల్లీలో భద్రతను మరింత పెంచారు. 144 సెక్షన్ అమలు చేసి, రోడ్లపై పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు.

కేంద్రం ఆహ్వానంపై చర్చించి నిర్ణయం: రైతు నేతలు

రైతులతో చర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అర్జున్ ముండా తెలిపారు. చర్చలకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని రైతు సంఘాలకు విజ్ఞప్తి చేశారు. కేంద్రం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని, వారి ఆందోళనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదన్నారు. మరోవైపు 'దిల్లీ చలో' కార్యక్రమంలో పాల్గొనే రైతులపై కొందరు తప్పుడు అభిప్రాయాలను కలగజేస్తున్నారని రైతు సంఘం నాయకులు సర్వాన్ సింగ్ పంధేర్, జగ్జిత్ సింగ్ దల్లేవాల్ తెలిపారు. కేంద్రంతో ఘర్షణ పడేందుకు తాము రాలేదన్నారు. ఎంఎస్‌పీ కి చట్ట బద్ధత సహా ఇతర డిమాండ్లపై కేంద్రంతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రధాని మోదీ పెద్ద మనసుతో ఎమ్ఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆహ్వానంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా పోలీసుల చర్యలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై పెట్టిన అడ్డంకులను తొలగించడానికి ట్రాక్టర్లతో యువ రైతులు సిద్ధంగా ఉన్నారని వారు చెప్పారు. ఇక భాష్ప వాయు గోళాల ప్రభావాన్ని తగ్గించుకోడానికి వాటర్ బాటిళ్లు, తడి వస్త్రాలను రైతులు వెంట తెచ్చుకున్నారు. అలాగే నీటి ట్యాంకులను కూడా సిద్ధంగా ఉంచినట్లు రైతులు తెలిపారు. కాగా రైతులు ఆందోళ ఉధృతమవుతున్న తరుణంలో సమస్య పరిష్కారంపై రాజ్‌నాథ్ సింగ్, అర్జున్ ముండా సహా కేంద్ర సీనియర్ మంత్రులు చర్చలు జరిపారు.

కాంగ్రెస్ మద్దతు

రైతులు చేపట్టిన 'దిల్లీ చలో' కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు తాత్కాలిక విరామం ప్రకటించారు. దిల్లీ సరిహద్దుల్లో ఉన్న రైతులను కలుస్తారని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కు చట్ట బద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

నేడు కేంద్రంతో చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమవుతారని తెలిపారు. అప్పటివరకు తాము శాంతియుతంగా ఉంటామని స్పష్టం చేశారు. ఉన్నచోటు నుంచి మరింత ముందుకు వెళ్లడానికి ప్రయత్నించకూడదని నిర్ణయించుకున్నట్లు పంధేర్ పేర్కొన్నారు. అయితే బుధవారం శాంతియుతంగా నిరసన తెలిపినప్పటికీ తమపై డ్రోన్‌లు ప్రయోగించారని, టియర్ గ్యాస్ షెల్స్, రబ్బర్ పెల్లెట్లు ప్రయోగించారని ఆయన పేర్కొన్నారు. "మాపై దాడి చేసింది పోలీసులు కాదు, పారామిలటరీ బలగాలు. ఇంత జరిగినా మేము కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాము" అని ఆయన అన్నారు.

వైవీ సుబ్బారెడ్డి వ్యాఖ్యల వక్రీకరణ

విశాఖ రాజధానికి అడ్డంకులు సృష్టించారు

మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఉమ్మడి రాజధాని మరో రెండేళ్లు హైదరాబాద్ ఉండాలన్న వైసీపీ నేత సుబ్బారెడ్డి వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపాయి. దీంతో వైసీపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. విశాఖలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ వైవీ సుబ్బారెడ్డి ఉమ్మడి రాజధాని గురించి ఏమన్నారో ఒకసారి పరిశీలిస్తే తెలుస్తోందని, ఆయన మాటల్లోని అటు పది ఇటు పది వ్యాఖ్యలు తొలగించి మధ్యలో వినిపించిన మాటల్ని పట్టుకుంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. సుబ్బారెడ్డి మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని, నిజంగా వైవీ సుబ్బారెడ్డి మాటలపై ప్రతిపక్షం విమర్శిస్తే దాన్ని కచ్చితంగా తాను ఖండిస్తానన్నారు. ఉమ్మడి రాజధాని హైదరాబాద్ అని ఇంకా ఎవరంటారని ప్రశ్నించారు. వైవీ మాటలను నూటికి నూరుశాతం వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఎదురుదాడికి దిగారు. వైవీతో తాను మాట్లాడినప్పుడు విభజన చట్టం హామీలపై ఏమన్నారో చెప్పారన్నారు. విభజన చట్టంలోని ప్రతీ అంశాన్ని సాధించాల్సి ఉందని మాత్రమే వైవీ సుబ్బారెడ్డి చెప్పారని, ఉమ్మడి రాజధానిని సద్వినియోగం చేసుకోకుండా చంద్రబాబు దొంగలా పారిపోయి వచ్చారని, ఇంకా రెండు నెలల్లో ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తోందన్నారు. ఐదేళ్ల ఉమ్మడి రాజధాని పదేళ్లు అన్నారు. ఓటుకు నోటులో అడ్డంగా దొరికిపోయి రాత్రికి రాత్రే చంద్రబాబు విజయవాడ వచ్చారు. అమరావతి అని తాత్కలిక భవనాలు నిర్మించారు. పదేళ్లు ఉమ్మడి రాజధాని ఇచ్చారని, అది పూర్తయితే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందన్నారు. విశాఖ పరిపాలన రాజధానిని అడుగడుగునా అడ్డుకుంటూ వస్తున్నారని బొత్స విమర్శించారు. ఉద్యోగులకు గత ప్రభుత్వంలో ఎప్పుడు బకాయిలు లేవా అని ప్రశ్నించారు. అవి ఇవ్వడంలో కొంత జాప్యం జరగవచ్చని, ఇవ్వడం మాత్రం పక్కా అన్నారు. సమ్మెకు వెళ్లకూడదని తాము కోరుకుంటున్నామన్నారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని తమ ప్రభుత్వం కోరుతోందని చెప్పారు. విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. రానున్న ఎన్నికల్లో ఒంటరిగానే తాము పోటీ చేస్తామని, బీజేపీని పొత్తులో స్వాగతం పలికేది టీడీపీ, జనసేన పార్టీలేనన్నారు. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అవసరమని, రాష్ట్ర అభివృద్ధి కోసమే తమ ముఖ్యమంత్రి ప్రధానిని కలుస్తున్నారన్నారు. తమపై ఆధారపడే కేంద్ర ప్రభుత్వం ఏర్పడినప్పుడే రాష్ట్రానికి నిధులు వస్తాయని, అభివృద్ధి పూర్తిస్థాయిలో జరుగుతుందన్నారు. ఖాళీ పోస్టులన్నింటికీ నోటిఫికేషన్ ఇచ్చామని మంత్రి బొత్స చెప్పారు.

జగన్‌వి కక్షపూరిత రాజకీయాలు: లోకేశ్

విశాలాంధ్ర-సాలూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం కోలుకోలేని దెబ్బకొట్టిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. నీటి ప్రాజెక్టులు, రోడ్లు నిర్మించకుండా... సంక్షేమం లేకుండా మోసపూరిత పాలన సాగించిందన్నారు. జగన్ ప్రభుత్వానికి కక్షపూరిత రాజకీయాలు తప్ప సంక్షేమం, అభివృద్ధి పట్టవని ఆరోపించారు. పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు పట్టణంలో బుధవారం టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అధ్వర్యంలో జరిగిన శంఖారావం సభలో లోకేశ్ మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనలో అరెస్టులు, హత్యలు, కక్షపూరిత రాజకీయాలు, తప్ప అభివృద్ధి లేదన్నారు. కొత్తగా పెట్టిన ఆడుదాం ఆంధ్రలో కూడా రాజకీయ వ్యవహార శైలిని చూపించారని విమర్శించారు. కులం, మతం, పార్టీ, ప్రాంతం, ఏది అవసరం లేదని నిరూపించారని, గెలిచిన టీడీపీ వారిని గెలవలేదంటూ రాజకీయం చేశారన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు వైసీపీ ప్రభుత్వంలో విలువ, గౌరవం లేదని సీనియర్ నాయకులు ఆ పార్టీని వీడారని లోకేశ్ ఎద్దేవా చేశారు. సొంత పార్టీ నాయకులకే విలువ ఇవ్వని జగన్... రాష్ట్ర ప్రజలకు, ప్రజాస్వామ్యానికి ఏం విలువిస్తారని ప్రశ్నించారు. బీసీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్న హామీని గాలికి వదిలేశారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో బీసీలందరూ జగన్‌కు గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రానికి సంక్షేమం పరిచయం చేసింది తెలుగుదేశం పార్టీ అని, ప్రజలకు సంక్షేమాన్ని దూరం చేస్తున్న ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిరుద్యోగులు పెరిగారని, ఐదేళ్లలో సచివాలయం ఉద్యోగాలు తప్పించి వేరేవి భర్తీ కాలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతి కింద నెల రూ.3వేలు ఇస్తుందని ప్రకటించారు. ప్రజల పక్షాన్నే నిలుస్తూ వారి సంక్షోమం కోసం పనిచేస్తుందని లోకేశ్ హామీనిచ్చారు. కార్యక్రమంలో నేతలు కిడారి శ్రావణ్ కుమార్, భంజ్ దేవ్‌తోపాటు జనసేన నేతలు పాల్గొన్నారు.

పెత్తనమిస్తాం... నీళ్లు నింపి చూపండి

చిత్తశుద్ధి ఉంటే సభకు వచ్చి మాట్లాడాలి: రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: మేడిగడ్డ కుంగిపోయిన నేపథ్యంలో అందులో నీళ్లు నింపడానికి అవకాశం ఎలా ఉంటుందో తమకు అర్థం కావడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో బుధవారం ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. నీరు నింపే అవకాశం ఉంటే ఆ పెత్తనం బీఆర్ఎస్ నేతలు కడియం శ్రీహరి, హరీశ్‌లకే ఇస్తామని, మీరే నీళ్లు నింపి చూపించండని పేర్కొన్నారు. సాగునీటిపై చర్చకు సిద్ధమైతే మీ పార్టీ సభాపక్ష నేతను అసెంబ్లీకి రమ్మనండి అంటూ సవాల్ విసిరారు. తమకు చిత్తశుద్ధి ఉందని, కాళేశ్వరం, నదీ జలాలపై చర్చకు మేం సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం, రైతులపై గౌరవం ఉంటే ప్రధాన ప్రతిపక్షం మంగళవారం మాతో పాటు మేడిగడ్డకు వచ్చేదన్నారు. కానీ వారికి ప్రజలు... వారి సమస్యలపై చిత్తశుద్ధి లేదని ఎంతసేపు వారికి అధికారమే ముఖ్యమనే రీతిలో వ్యవహరిస్తున్నారన్నారు. పదేపదే బీఆర్ఎస్ నేతలు తమ భాష గురించి మాట్లాడుతున్నారు కానీ దానికంటే ముందు మాజీ సీఎం కేసీఆర్ నిన్న నల్లగొండలో మాట్లాడిన భాషపై చర్చిద్దామా అంటూ నిలదీశారు. ఒక సీఎంను పట్టుకుని పీకనీకి పోయారా అని అంటారా? తెలంగాణ ప్రజలు మొన్నటి ఎన్నికల్లో మీ ప్యాంటు పీకేశారు అయినా బుద్ధి రాలేదని దుయ్యబట్టారు. కేసీఆర్‌ను చంపుతారా అని అంటుండు కానీ చచ్చిన పామును మేమే కాదు ఎవరూ చంపాలనుకోరన్నారు. మీరు చెప్పినట్టు మెడిగడ్డలో రెండో మూడో పిల్లర్లు కుంగినయంటే సభలో చర్చ చేయడానికి రావాలి తప్ప పారిపోయి అక్కడెక్కడో ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దానిపై చర్చించండని, కాళేశ్వరంపై కూడా మేం చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

తెలంగాణ హైకోర్టుకు జస్టిస్ మౌషమీ, జస్టిస్ సుజోయ్ బదిలీ

సుప్రీం కొలీజియం సిఫార్సు

న్యూదిల్లీ: కలకత్తా హైకోర్టు జడ్జి మౌషమీ భట్టాచార్య, జస్టిస్ సుజోయ్ పాల్, కేరళ హైకోర్టు జడ్జి అను శివరామన్ బదిలీకి సుప్రీం కొలీజియం అంగీకరించింది. జస్టిస్ మౌషమీ భట్టాచార్య, జస్టిస్ సుజోయ్ పాల్‌ను తెలంగాణ హైకోర్టులో నియమించేందుకు సిఫార్సు చేసింది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌ను కర్నాటక హైకోర్టుకు బదిలీ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఏదేని హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ భట్టాచార్య కోరగా అందుకు సుప్రీం కొలీజియం అంగీకరించింది. తెలంగాణ హైకోర్టుకు జస్టిస్ మౌషమీ భట్టాచార్య బదిలీకి సిఫార్సు చేసింది. మధ్యప్రదేశ్ హైకోర్టులో తన కుమారుడు ప్రాక్టీస్ చేస్తుండటంతో తనను అక్కడకు బదిలీ చేయాలని ఈనెల 12న జస్టిస్ సుజోయ్ పాల్ కోరగా కొలీజియం ఆయనను కూడా తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసేలా సిఫార్సులు చేసింది. సుప్రీం కొలీజియంలో సీజేఐ చంద్రచూడ్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ అనిరుద్ధా బోస్ ఉన్న విషయం తెలిసిందే.

తెలంగాణ నుంచి రాజ్యసభకు...

రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్ పేర్ల ఖరారు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ నుంచి రాజ్యసభకు ఇద్దరికి అవకాశం కల్పిస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. కేంద్ర మాజీ మంత్రి, ఫైర్ బ్రాండ్‌గా పేరొందిన ఖమ్మం జిల్లాకు చెందిన రేణుకా చౌదరికి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం సేవలందించిన అనిల్ కుమార్ యాదవ్‌కు అవకాశం కల్పించారు. ఈమేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం లేఖ విడుదల చేశారు. ఇటీవల ఖమ్మం జిల్లా నుంచి తనకు ఎంపీగా అవకాశం కల్పించాలని కోరుతూ రేణుకా చౌదరి దరఖాస్తు చేసుకున్నారు. పోటీ కూడా అధికంగానే ఉండడంతో ఆమెకు టికెట్ ఎంతవరకు వస్తుందన్న విషయంలో కూడా పెద్దఎత్తున చర్చ సాగింది. అయితే అనూహ్యంగా ఆమెకు రాజ్యసభకు అవకాశం కల్పించడం వల్ల అక్కడ ప్రధాన పోటీదారు బరిలో నుంచి తప్పుకున్నట్లు అయింది. గత ఎమ్మెల్యే ఎన్నికల సందర్భంగా టికెట్ ఆశించి విఫలమైన అనిల్ కుమార్ యాదవ్‌కు ప్రస్తుతం రాజ్యసభకు అవకాశం కల్పించడంతో ఆయనకు పార్టీ తగిన గుర్తింపు ఇచ్చినట్లు కనిపిస్తోంది.

కాంగ్రెస్ బురద రాజకీయం

కాళేశ్వరం గొప్పదనం తెలుసుకోండి: హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ బురద జల్లుడు రాజకీయాలకు పాల్పడుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం సమగ్ర స్వరూపం చాలా మందికి తెలియదని, కాళేశ్వరం అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్ హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల స్టోరేజ్ కెపాసిటీ, 530 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్... వీటన్నింటి సమాహారం కాళేశ్వరం అంటూ చెప్పుకొచ్చారు. మొన్న మీరు మేడిగడ్డ వెళ్తుంటే ఎమ్మెల్యేలకు పచ్చని పొలాలను చూపించాల్సిందని, కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మీరెంత తక్కువ చేసి మాట్లాడినా అది ముమ్మాటికి తెలంగాణకు వరదాయిని, తెలంగాణ ప్రజలకు జీవధార అని పేర్కొన్నారు. లోయర్ మానేరు నుంచి సూర్యాపేట దాకా నిండిన చెరువులు, పండిన పంటలు, భూమిలో పెరిగిన ఊట, మోటారు లేకుండానే ఉబికివస్తున్న బోర్ల పంపులు ఇవన్నీ కాళేశ్వరం ఫలాలే అని అన్నారు. కూడెల్లి వాగు పొంగిందన్నా, హల్దీ వాగు దుంకిందన్నా, అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక్ సాగర్, మల్లన్న సాగరం, కొండ పోచమ్మ సాగర్ నిండిందన్నా అది కాళేశ్వరం ప్రసాదించిన ఫలితమే అని స్పష్టం చేశారు.

పెరిగిన పంటరాశుల్లో ప్రతిబింబించింది కాళేశ్వరమే. ఇవాళేదో రెండు పిల్లర్లు కుంగినయని, తెలంగాణకు ప్రాణాధారమైన జీవాధారను అవమానిస్తున్నారన్నారు. అలక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. రాయకీయలబ్ధి కోసం మొత్తం ప్రాజెక్టునే డ్యామేజ్ చేయాలనే దుష్ట పన్నాగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. కుంగిన పిల్లర్లకు రిపేర్లు చేయించండి పొలాలకు నీళ్లు మళ్లించండి అని శాసనసభ ద్వారా చెప్పామని అలాగే కావాలంటే విచారణలు జరిపించండి, బాధ్యులయిన వారిని నిరభ్యంతరంగా శిక్షించండి అని తెలిపారు. కానీ ప్రజల ప్రయోజనాలకు గండి కొట్టొద్దని తెలంగాణ రైతుల నోట్లో మన్ను కొట్టకండి అని హితవు పలికారు. కడెం వాగు ప్రాజెక్టులు కట్టంగనే కొట్టుకుపోతే పునరుద్ధరించారని, అలాగే సింగూరు డ్యాం, ఎల్లంపల్లి, సాత్నాల ప్రాజెక్టులు కూడా కొట్టుకుపోయాయని గుర్తు చేశారు. పుట్టగండి ప్రాజెక్టు ప్రారంభించగానే కొట్టుకుపోయిందని కాంగ్రెస్ హయాంలో పంజాగుట్టలో ఫ్లై ఓవర్ కూలి 22 మంది చనిపోయారన్నారు.

రాజ్యసభకు ఏకగ్రీవమే

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తుతాయోమోనన్న ఆందోళన వైసీపీ రాజ్యసభ అభ్యర్థుల్లో వ్యక్తమైంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వచ్చే శాసనసభ ఎన్నికలకు వరుసగా విడుదల చేసిన ఆరు జాబితాల్లో ఇప్పటివరకు 32 మంది వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు సీట్లు గల్లంతయ్యాయి. వీరిలో చాలామంది బహిరంగంగానే వైసీపీ అధిష్ఠానంపై అసంతృప్తి వెళ్లగక్కారు. టీడీపీ రాజ్యసభకు పోటీ చేస్తే వీరందర్నీ కాపాడుకోవడానికి వైసీపీ నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు భయపడ్డారు. పోటీకి దూరంగా ఉండాలని టీడీపీ నిర్ణయించడంతో వైసీపీ రాజ్యసభ అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. వైసీపీ నుంచి నామినేషన్లు దాఖలు చేసిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, రఘునాథరెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రస్తుతం రాజ్యసభలో టీడీపీ సభ్యుడిగా ఉన్న కనకమేడల రవీంద్రకుమార్ ఏప్రిల్ 2వ తేదీన రిటైర్ కానున్నారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీకి రాజ్యసభలో తొలిసారి పూర్తిస్థాయిలో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆవిర్భావం తర్వాత రాజ్యసభలో టీడీపీ ఖాళీ కావడం ఇదే మొదటిసారి అవుతుంది. అలాగే రాష్ట్ర కోటా ప్రకారం మొత్తం 11 మంది రాజ్యసభ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు పెద్దల సభలో ఉండటం కూడా ఇదే మొదటిసారి కానుంది.

వైసీపీకి ఇంటి పోరు

(మొదటిపేజీ తరువాయి)

చేర్పులు వైసీపీకి పెద్ద తలనొప్పిగా మారాయి. కాగా వైసీపీ విడుదల చేసిన ఆరు విడతల జాబితాల్లో చాలా మందికి టికెట్లు దక్కలేదు. వారిలో సగానికిపైగా అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే కొందరు పార్టీని వీడేందుకు సిద్ధమవ్వగా, మరికొందరు మౌనంగా ఉండిపోయారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల తర్వాత భవిష్యత్ నిర్ణయం తీసుకుందామనే వ్యూహంతో మరికొందరున్నారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పటి నుంచి చాలా మంది అసంతృప్త ఎమ్మెల్యేలు సీఎం జగన్‌ను, వైసీపీ ముఖ్యనేతలను కలిశారు. తాము పార్టీని వీడటం లేదని నొక్కిచెప్పారు. పార్టీ విజయానికి కృషి చేస్తామని చెబుతున్నారు.

దీంతో ఏడో జాబితాపైనా సీఎం జగన్ కసరత్తు ప్రారంభించారు. పార్టీని వీడుతున్నారన్న సమాచారం రాగానే, తక్షణమే అక్కడి జిల్లాల నేతలను పిలిపించి... వారికి ప్రత్యామ్నాయంగా మరో ఇన్‌ఛార్జిని ప్రకటిస్తున్నారు. దీంతో మళ్లీ అసంతృత్తులు వస్తున్నాయి. వారికి సీఎం జగన్ నుంచి ముఖ్యనేతల వరకు బుజ్జగింపులు చేపట్టినప్పటికీ వెనక్కి తగ్గడంలేదు.

పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట

- నాలుగున్నరేళ్లలో 2.5 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు
- మంత్రి గుడివాడ అమర్నాథ్ వెల్లడి
- రూ.4,178 కోట్ల ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతినిస్తున్నామని, కొత్త పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. రూ.4,178 కోట్లతో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న బిర్లా గ్రూప్, రిలయన్స్ ఎనర్జీ, హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌లకు సంబంధించిన ఎనిమిది ప్రాజెక్టులకు బుధవారం వెలగపూడి సచివాలయం నుంచి మంత్రి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సులభతర వాణిజ్యంలో ఏపీ దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా 11 పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేస్తుండగా, రాష్ట్ర పరిధిలో విశాఖపట్నం-చెన్నై, చెన్నై-బెంగుళూరు, బెంగుళూరు-హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటవుతున్నాయని వెల్లడించారు. సుమారు రూ.20వేల కోట్లతో నాలుగు ప్రధాన పోర్టులను నిర్మిస్తుండగా, రామాయపట్నం పోర్టు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని మంత్రి చెప్పారు. 10 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటవుతున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ఎంఎస్ఎంఈల ప్రోత్సాహానికి పాధాన్యత ఇస్తున్నామన్నారు. నాలుగేళ్లలో 2.50 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు నెలకొల్పామని మంత్రి వెల్లడించారు. పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడుదల సదస్సులో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రక్రియలో భాగంగా ఎనిమిది ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్ సీహెచ్. రాజేశ్వర్ రెడ్డి, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో సేధు మాధవన్, ఆదిత్యా బిర్లా గ్రూపు సంస్థ ఏపీ-తెలంగాణ హెడ్ రాచిట్, రిలయన్స్ బయో ఎనర్జీకి చెందిన వివేక్ తనేజ, హెల్లా ఇన్ఫ్రా మార్కెటింగ్ సంస్థకు చెందిన సౌత్ ఇండియా హెడ్ కెఆర్ రఘునాథ్, వెసువియస్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన రోహిత్ బహెటి పాల్గొన్నారు.

నేడు 'విధ్వంసం' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: సీనియర్ పాత్రికేయుడు ఆలపాటి సురేశ్ కుమార్ రచించిన 'విధ్వంసం' పుస్తకావిష్కరణ సభ గురువారం ఎంజీ రోడ్డులోని ఏ1 కన్వెషన్‌లో జరగనుంది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. తొలి ప్రతిని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అందుకుంటారు. విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావు అధ్యక్షతన జరిగే సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, అమరావతి పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎ.శివారెడ్డి, అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య పాల్గొంటారు.

మోదీ పాలనలో దళితులకు రక్షణ కరువు: కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించి తేనే బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్తు ఉంటుందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు అన్నారు. స్థానిక ఎన్‌అర్ దాసరి క్రాంతిభవన్‌లో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి అధ్యక్షత జరిగిన ముఖ్య సభ్యుల సమావేశంలో సుబ్బారావు మాట్లాడారు. బీజేపీ హయాంలో దళితులపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని, ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కేటాయింపులు తగ్గాయని, నిధులు దారి మళ్లాయని అన్నారు. ఎస్టీ, ఎస్సీ అట్రాసిటీ కేసుల తీవ్రతను తగ్గించి బాధితుల మీదే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దళిత ద్రోహి అని విమర్శించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సుబ్బారావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నవరత్నాలకు సబ్ ప్లాన్ నిధులు కేటాయించడం దారుణమన్నారు. దళిత వాడల్లో మౌలిక వసతులు అధ్వానమని, తాగు నీరు, రోడ్లు, స్మశాన వాటికలు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. దళితుల అభ్యున్నతికి డీహెచ్‌పీఎస్ అలుపెరుగని పోరాటాలు చేస్తుందని, సమస్యలు పరిష్కారం కాకుంటే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని కరవది సుబ్బారావు అన్నారు. డీహెచ్‌పీఎస్ బలోపేతానికి ప్రతీ సభ్యుడు తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతాంగంపై దమనకాండ దారుణం

ఏఐకేఎస్, రైతు సంఘాల సమన్వయ సమితి నేతలు రావుల, ఈశ్వరయ్య, ప్రసాద్ ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఢిల్లీ-శంబూ సరిహద్దు వద్ద రైతాంగంపై కేంద్ర ప్రభుత్వం సాగించిన దమనకాండను ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సమన్వయ సమితి తరపున, ఏపీ రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్... వెంటనే రైతు సంఘాలతో ప్రభుత్వం చర్చించాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 16న గ్రామీణ బంద్‌ను పురస్కరించుకుని గ్రామగ్రామాన ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపునిచ్చిందని తెలిపారు. రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

బీజేపీ దుందుడుకు చర్యలు ఖండించండి: దేగా, జమలయ్య,

విశాలాంధ్ర, ఏలూరు: హామీలు అమలు చేయాలని కోరుతూ ఢిల్లీకి వస్తున్న రైతులపై టియర్ గ్యాస్ ఉపయోగించి, లాఠీచార్జి చేసి దమనకాండకు పాల్పడిన కేంద్రం చర్యను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు దేగా ప్రభాకర్, ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జమలయ్య తీవ్రంగా ఖండించారు. సీపీఐ జిల్లా కార్యాలయ స్ఫూర్తి భవనంలో బుధవారం సంఘం ఏలూరు జిల్లా కౌన్సిల్ సమావేశం రావెళ్ల రాజారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దుందుడుకు చర్యలను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని కోరారు. రైతులు శాంతియుతంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీపై మోదీ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగి దమనకాండకు పాల్పడటం దుర్మార్గమన్నారు.

అంగీకరించిన అంశాలపై జీవోలు విడుదల చేయాలి

సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: ఏఐటీయూసీ, సీఐటీయూ తదితర కార్మిక సంఘాల సంయుక్త అధ్వర్యంలో డిసెంబర్ 26 నుంచి జనవరి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ ప్రతినిధులకు, జేఏసీ నాయకులకు మధ్య జరిగిన చర్చలలో అంగీకృత ఒప్పందాలకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ జీవోల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ కార్మిక వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కోటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత ఇబ్రహీంపట్నం ఏఐటీయూసీ కార్యాలయం నుండి జెండాలు చేతబట్టి ప్రభుత్వం అంగీకరించిన మున్సిపల్ కార్మిక సమస్యలను సంబంధించిన జీవోలను విడుదల చేసి అమలు చేయాలని నినదిస్తూ కార్మికులు ప్రదర్శనగా రింగ్ సెంటర్ వద్ద గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడ యూనియన్ అధ్యక్షులు టీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ... 17 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నూటికి నూరు శాతం మున్సిపల్ కార్మికులు ఐక్యంగా నిర్వహించిన సమ్మెకు దిగివచ్చిన ప్రభుత్వం ఏఐటీయూసీ, సీఐటీయూ తదితర యూనియన్ల తో కూడిన జేఏసీ నాయకులతో జరిపిన చర్చలు ఫలప్రదంగా జరిగినప్పటికీ ప్రభుత్వం అంగీకరించిన మేరకు సంబంధించిన జీవోలను విడుదల చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందున కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్మికులు సహనం కోల్పోయి మరో సమ్మె జరిగే దుస్థితి రాకముందే ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి నీ నరసింహారావు, ఉప ప్రధాన కార్యదర్శి జీ మధుసూదన్ రావు, ఉపాధ్యక్షురాలు శ్రీరామ్ దుర్గ, సహాయ కార్యదర్శి జ్యోతి తదితరులు ప్రసంగించారు. సమ్మె అనంతరం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లును యూనియన్ తరపున కలిసి... ఆదివారం ఒక పూట మాత్రమే సెలవు ఇస్తున్నారని మరో పూట బుధవారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసిన మీదట అంగీకరించి అమల్లోకి తెచ్చారన్నారు. అలాగే ఇంజనీరింగ్ పనులు, వాటర్ సప్లై, ఎలక్ట్రిసిటీ డ్రైవింగ్ పనులు చేస్తున్న కార్మికులను వారు చేస్తున్న పని స్వభావాలను రిజిస్టర్లో నమోదు చేయాలని చేసిన విజ్ఞప్తికి కమిషనర్ సానుకూలంగా స్పందించి... కేటగిరీలను నమోదు చేయడం జరిగిందన్నారు. యూనిఫాం , సబ్బులు, కొబ్బరి నూనె, గ్లౌజెస్ తదితర రక్షణ సౌకర్యాలను యూనియన్ చేసిన విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నిరసనకు సీపీఐ ఇబ్రహీంపట్నం కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయ్ కుమార్, తిరుపతిరావు కే సాంబయ్య, భాస్కరరావు, బాలమ్మ, నాగమణి, జయంతి కుమార్ రాజేష్, కృష్ణ తదితరులు నాయకత్వం వహించారు.

బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు

చెల్లని చెక్కు కేసులో కోర్టు తీర్పు

విశాలాంధ్ర -ఒంగోలు: ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు జిల్లా కోర్టు ఏడాది శిక్ష, రూ.10వేలు జరిమానా విధించింది. 2019లో మద్దిరాల ముప్పాళ్ళ గ్రామానికి చెందిన జెట్టి జానకి రామయ్య నుంచి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన బండ్ల గణేశ్ రూ.95 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అదే ఏడాది జానకిరామయ్య మృతి చెందారు. దీంతో అతడి తండ్రి జెట్టి వెంకటేశ్వర్లు హైదరాబాద్ వెళ్లి తన కుమారుడు ఇచ్చిన అప్పు చెల్లించాలని కోరారు. బండ్ల గణేశ్ రూ.95 లక్షలకు చెక్కు రాసిచ్చారు. చెక్కు ఒంగోలు బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయింది. దీంతో వెంకటేశ్వర్లు జిల్లా కోర్టును ఆశ్రయించారు. బండ్ల గణేశ్ కోర్టుకు హాజరు కాకుండా వాయిదాలు కోరుతూ, బెయిల్ పొందుతూ కాలం గడుపుతూ వచ్చారు. దీంతో ఫిర్యాది వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. వెంటనే తీర్పు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు తుది తీర్పును బుధవారం వెల్లడించింది. ఫిర్యాదికి రూ.95 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. పైన పేర్కొన్నవిధంగా తీర్పు వెల్లడించింది.

శ్రీకాళహస్తిలో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన ముగ్గురు జెడ్పీటీసీలు, మాజీ జెడ్పీటీసీ

విశాలాంధ్ర-తొట్టంబేడు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో వైసీపీకి షాక్ తగిలింది. జెడ్పీటీసీ కాపిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, తొట్టంబేడు జెడ్పీటీసీ పందింటి అర్చనాదేవి, ఏర్పేడు జెడ్పీటీసీ తిరుమలయ్య, శ్రీకాళహస్తి మాజీ జెడ్పీటీసీ పన్నీరుకాల్వ వెంకటాచలం, అర్చనాదేవి భర్త, మాజీ సర్పంచ్ మునిరత్నం, వైసీపీ నేత హరి నాయుడుతో పాటు కొందరు బుధవారం టీడీపీలో చేరారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పక్కా ప్రణాళికతో జెడ్పీటీసీలను తమ పార్టీలోకి తీసుకొచ్చారు. కొన్ని నెలల కిందటే మాజీ శాసనసభ్యులు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. సీఐ అంజూయాదవ్‌పై న్యాయ పోరాటం చేస్తున్న హరినాయుడు, ఆయన సతీమణి కూడా టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన 32మంది సర్పంచులు, రేణిగుంట మండలంలో వైసీపీకి చెందిన ప్రముఖ నేత కూడా త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు తెలిసింది.

'చలో విజయవాడ'కు సిద్ధం కావాలి: తిమ్మన్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 27న జేఏసీ తలపెట్టిన చలో విజయవాడకు సిద్ధం కావాలని సంఘం రాష్ట్ర కో-చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు విజయవాడ పటమట జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తిమ్మన్న మాట్లాడుతూ, 12వ పీఆర్సీ జులై 1, 2023 నుంచి అమలు కావాల్సి ఉందని, తక్షణమే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లించాలన్నారు. జీవిత బీమా, భవిష్య నిధి ఆర్జిత సెలవులు, కరోనా భత్యం బకాయిలు వెరసి రూ.25 వేల కోట్లు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జీవో 57 అమలు చేసి 2003 నోటిఫికేషన్ ద్వారా నియమింపబడిన వారందరికీ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. 2024 డీఎస్సీలో అప్రంటీస్ విధానం రద్దు చేయాలని, జీవో 117 రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలు, పబ్లిక్ సెక్టర్ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు వర్తింపజేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్లు చెల్లించాలన్నారు. గురుకుల, కస్తూరిబా పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని అన్నారు. 70 ఏళ్లు నిండిన పెన్షనర్లకు అదనపు పెన్షన్ 15 శాతానికి పెంచి మంజూరు చేయాలని పేర్కొన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, ఎస్టీయూ విజయవాడ నగర కార్యదర్శి మస్తాన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ అశోక్, వెంకటేశ్వరరావు, పాల్, ప్రశాంతి, పవీణ్ పాల్గొన్నారు.

ఏయూలో ఆహార నాణ్యత పరీక్ష ప్రయోగశాల ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆంధ్ర యూనివర్సిటీ కెమెస్ట్రీ విభాగంలో రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన ఆహార నాణ్యత పరీక్ష, ప్రమాణీకరణ ప్రయోగశాలను బుధవారం విశాఖ నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి... శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి, కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి ప్రారంభించారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో జరిగిన ఒప్పందాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండు వ్యవసాయ ఉత్పత్తి కేంద్రాల ప్రారంభోత్సవంతో పాటు వివిధ పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. తాడేపల్లి నుంచి రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, నెల్లూరు నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లాలో ఏపీఎఫ్‌పీఎస్ (ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) నిధులు రూ.5 కోట్లతో ఆరువేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏయూలో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ మరియు స్టాండరైజేషన్ లేబొరేటరీ శిలాఫలకాన్ని మేయర్ ఆవిష్కరించారు. ప్రయోగశాలను ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి... కలెక్టర్ మల్లికార్జునతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఇది ఆహార నాణ్యత పరీక్ష సౌకర్యాన్ని అందించే అత్యాధునిక ప్రయోగశాలని వీసీ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి వివరించారు. విద్యా, వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు ఏపీఎఫ్‌పీఎస్ రూ.5 కోట్లు, సీఎస్ఆర్ నిధుల నుంచి కలెక్టర్ రూ.రెండు కోట్లు మంజూరు చేశారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావు, ఫార్మసి కళాశాల ప్రిన్సిపాల్ వై. రాజేంద్రప్రసాద్, ఆర్‌అండ్‌డీ డీన్ ప్రొఫెసర్ కె.బసవయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లు

కమీషన్ల కోసం అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర-పాడేరు: పౌష్టికాహార లోపాన్ని నివారించే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు గుడ్లు, పాలతో పాటు పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అయితే కమీషన్ల కోసం కొందరు అధికారులు కక్కుర్తి పడుతుండటంతో చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందడం లేదు. తాజాగా ఓ అంగన్‌వాడీ కేంద్రానికి కుళ్లిన గుడ్లు సరఫరా కావడం దుమారం రేపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు మండలంలోగల సుండుపుట్టు అంగన్‌వాడీ కేంద్రంలో ఈ ఘటన జరిగింది. పాంగి రోజా అనే బాలింతకు ఈనెల 5న అంగన్‌వాడీ టీచర్ ఇచ్చిన గుడ్లు కుళ్లిపోయి ఉన్నాయి. కుళ్లిన గుడ్లు ఎలా తినాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఓ అధికారి భయంతో అంగన్‌వాడీ టీచర్లు నోరు మెదపడం లేదని, నాసిరకం ఆహార పదార్థాలను తీసుకుంటున్నారని తెలుస్తోంది. కోడిగుడ్లు సాధారణంగా 10-14 రోజులు, శీతల వాతావరణంలో 20-30 రోజులు నిల్వ ఉంటాయి. నాణ్యతలేని సరకును కాంట్రాక్టర్లు సరఫరా చేస్తున్నా కేవలం కమీషన్ల కోసం జిల్లా అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారు. కుళ్లిన, తక్కువ పరిమాణంగల గుడ్లు సరఫరా చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. 44 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు బరువు ఉండే గుడ్లు సరఫరా చేయాల్సి ఉండగా 30 గ్రాముల కన్నా తక్కువ బరువున్న, కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తూ కాంట్రాక్టర్లు చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

విశాఖలో 25 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నిర్మించాలి

ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్

విశాలాంధ్ర - విశాఖ: ఉత్తరాంధ్ర ప్రాంత మైన విశాఖపట్నంలో 25 పడకలతో ప్రాంతీయ ఆర్టీసీ ఆసుపత్రి నిర్మించాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో ఆర్టీసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు అవసరమైన వైద్య సేవల కోసం ఆనాడు ఎంప్లాయీస్ యూనియన్ నేతృత్వాన ఉద్యోగి వేతనం నుంచి ప్రతినెలా రూ.100 రికవరీ చేయించామని గుర్తుచేశారు. వాటి ద్వారా విజయవాడ విద్యాధరపురంలో 50 పడకల సెంట్రల్ హాస్పిటల్‌ను నిర్మించామని వివరించారు. రాయలసీమ ప్రాంతంలోని కడపలో నిర్మించిన 25 పడకలు ఆర్టీసీ ఆసుపత్రి తరహాలో విశాఖలోనూ 25 పడకలతో ఆసుపత్రిని నిర్మించాలన్నారు. దీని ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతంలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులతో పాటు విజయవాడ జోన్ పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని డిపోలలో పనిచేసే ఉద్యోగులకూ అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విశాఖపట్నానికి ఆన్ డ్యూటీకి వస్తున్న సిబ్బందికి అత్యవసర సమయాల్లో చికిత్సలకూ ఉపయోగపడుతుందని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 19 ఆసుపత్రుల్లో కొన్నింటిని అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేశారని, మిగిలివాటినీ అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

అశాంతికే వైసీపీ రాజధాని నాటకం: దాడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, తెలుగు రాష్ట్రాల్లో అశాంతి నెలకొల్పడం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కోపంతోనే వైసీపీ నేతలు రాజధాని అంశంపై మాట్లాడుతున్నారని, నాల్గో రాజధాని హైదరాబాద్ అనడం పెద్ద కుట్ర అని మాజీమంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను రాజధాని చేసే వరకూ హైదరాబాద్ రాజధాని కావాలనడం ఏపీ, తెలంగాణ మధ్య అగ్గి రాజేయడానికేనన్నారు. వైవీ సుబ్బారెడ్డితో సీఎం జగనే ఈ చిలక పలుకులు పలికించారన్నారు. హైదరాబాద్ రాజధాని కావాలనడం తెలుగు రాష్ట్రాల్లో అశాంతి రాజేయడానికేనని, ఆంధ్రుల ఆత్మ గౌరవంతో వైసీపీ ఆటలాడు తోందన్నారు. ఏపీ ప్రజలను మభ్య పెట్టడానికేనా ఈ ప్రకటనలు అని దాడి ప్రశ్నించారు. పరిపాలన రాజధాని అని చెప్పడంతో విశాఖలో భూముల రేట్లు పెరిగాయన్నారు. సీఎం మూడు రాజధానులు అన్నారని, ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. మూడు ప్రాంతాల వారిని జగన్ మోసం చేశారని అన్నారు. రాష్ట్రాన్ని గాలికి వదిలేశారని, జగన్ ఒక పెద్ద నియంతన్నారు. 60 రోజుల్లో ఇంటికి వెళ్లిపోతారన్నారు. ఐదేళ్లుగా ఏపీ ప్రజలతో జగన్ ఆడుకుంటున్నారని, ఇప్పుడు ఆడుదాం ఆంధ్రా అంటున్నారని మండిపడ్డారు. బటన్ నొక్కడానికి జగన్ అవసరం లేదని, ఆయన ఎన్ని గిమ్మిక్కులు చేసినా వైసీపీకి ఓటమి తప్పదని జోశ్యం చెప్పారు.

సంపాదకీయం

పాకిస్థాన్‌లో అనిశ్చితి

పరిపాలనను గుప్పెట్లో పెట్టుకోవాలన్న నిరంతర దుగ్ధ ఉన్న పాకిస్థాన్ సైన్యం అంచనాలు అన్నీ తారుమారయ్యాయి. సైన్యం మద్దతు ఉన్న మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ నాయకత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (నవాజ్) ఘన విజయం సాధించాలని పాక్ సైన్యం పెట్టుకున్న ఆశలన్నీ వమ్ము అయినాయి. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీలో (పార్లమెంట్) మొత్తం 265 స్థానాలున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి 133 సీట్లు ఉండాలి. కానీ నవాజ్ షరీఫ్ పార్టీ 73 సీట్లతో సంతృప్తి పడవలసి వచ్చింది. ఆసిఫ్ అలీ జర్దారీ, ఆయన కుమారుడు బిలావల్ భుట్టో నాయకత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి 54 స్థానాలు మాత్రమే దక్కాయి. విచిత్రం ఏమిటంటే పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇస్లాం నాయకుడు ఇమ్రాన్ ఖాన్ పార్టీకి ఎన్నికల చిహ్నం కేటాయించలేదు. కానీ ఆయనను సమర్థించే వారు 102 మంది స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచారు. పాకిస్థాన్‌లో అమలులో ఉన్న విధానం ప్రకారం రాజకీయ పార్టీ మాత్రమే ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం ఉంది. ఇమ్రాన్ ఖాన్ మీద అనేక ఆరోపణలు మోపి ఎన్నికలకు ముందు ఆయనను జైలులో పెట్టి ఎన్నికలలో పోటీ చేయకుండా చేశారు. పాకిస్థాన్ సైన్యం ఎత్తుగడలలో దిట్ట కావచ్చు. కానీ ప్రజల మనోభావాలను పసిగట్టడంలో ఘోరంగా విఫలమైనందువల్లే నవాజ్ షరీఫ్ పార్టీని ఎంత వెనకేసుకొచ్చినా ఆయన పార్టీ 73 స్థానాల దగ్గరే ఆగిపోయింది. పాకిస్థాన్ ప్రజలు వంశపారంపర్య పాలనతో, సైన్యం జోక్యంతో విసిగి పోయి ఉన్నారు. అందుకే సైన్యం పాచికలు పారని రీతిలో తీర్పు చెప్పారు. ఇమ్రాన్ పార్టీకి అనుకూలురైన ఇండిపెండెంట్లను భారీ సంఖ్యలో గెలిపించారు. 2002లో అవిశ్వాస తీర్మానం ద్వారా ఇమ్రాన్ ఖాన్ పదవి నుంచి తప్పుకోవలసి వచ్చింది. అయినా సైన్యం ఆయనను వేటాడడం మానలేదు. ఒక వేపు పాకిస్థాన్ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడుతోంది. మరో వేపు మిలిటెంట్ల దాడులు జన జీవనాన్ని చిందరవందర చేస్తున్నాయి. ఈ రెండు సమస్యలను పరిష్కరించే మార్గమైతే సైన్యం దగ్గర లేదు కానీ ఎన్నికల ప్రక్రియలో బాహాటంగా జోక్యం చేసుకుని, నవాజ్ షరీఫ్ పార్టీకి మద్దతిచ్చి కొత్త ప్రభుత్వాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి చేయవలసిందంతా చేసింది. అయినా ఫలితం దక్కలేదు. నవాజ్ షరీఫ్ పార్టీ జాతీయ అసెంబ్లీలో కనీసం వంద స్థానాలైనా సంపాదించి సునాయాసంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న పాకిస్థాన్ రాజకీయ వ్యాఖ్యాతల అంచనాలన్నీ తప్పాయి. ఇమ్రాన్ పార్టీకి ఎన్నికల చిహ్నం ఇవ్వడానికి నిరాకరించి నందువల్ల ఆయన మద్దతు దార్లు ప్రభుత్వం ఏర్పాటు చేయలేరు. ఆ పార్టీని సమర్థిస్తున్న మహిళలకు, సాంకేతిక నిపుణులకు ఇప్పుడు కేవలం ఒక్క స్థానం మాత్రమే సంపాదించిన మజ్లిస్-ఎ-వహాదతుల్ ముస్లిమీన్‌తో జత కట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇమ్రాన్ ఖాన్ ను అనేక రకాలుగా వేదించినందుకు సైన్యం మీద ఉన్న జనాగ్రహం ఇండిపెండెంట్లను అధిక సంఖ్యలో గెలిపించడం దగ్గరే ఆగిపోయింది. పాకిస్థాన్ గత చరిత్రను గమనిస్తే ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు ఎక్కువ కాలం బతికి బట్ట కట్టిన ఉదంతాలు తక్కువ. అనేక సార్లు సైన్యం అధికారం చేపట్టి ప్రజాస్వామ్య ప్రక్రియను ధ్వంసం చేసింది.

ఈ స్థితిలో ఏదో ఒక పక్షమో, కొన్ని పార్టీలు కలిసో ప్రభుత్వం ఏర్పాటు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. నవాజ్ షరీఫ్ నాయకత్వంలోని ముస్లిం లీగ్ (ఎన్), బిలావల్ భుట్టో నేతృత్వంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఇటీవలి ఎన్నికలలో ప్రత్యర్థి పక్షాలుగా ఉన్నప్పటికీ ఆ రెండు పక్షాలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయక తప్పదు. ఈ రెండు పక్షాలు ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా చేతులు ముడుచుకుని కూర్చుంటే మళ్లీ సైన్యం రంగంలోకి దిగి తన పని తాను చేసుకుపోయి ప్రజాస్వామ్యం గొంతు నులిమివేస్తుంది. ప్రస్తుత పరిస్థితిలో నవాజ్ షరీఫ్ కీలక పాత్ర పోషించక తప్పదు. ఆయన మీదా అవినీతితో సహా అనేక ఆరోపణలు ఉన్నాయి. పాకిస్థాన్ లో మనలేక ఆయన ప్రవాస జీవితం గడపవలసి వచ్చింది. ఎన్నికలకు నాలుగు నెలల ముందు మాత్రమే ఆయన పాకిస్థాన్ తిరిగి వచ్చారు. ఆ తరవాత కూడా ఆయన రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించకుండా నిష్క్రియాపరుడిగా ఉండిపోయారు. ఎన్నికల ప్రచారం కూడా 20 రోజుల ముందు మాత్రమే కొనసాగించారు. ఇంతకు ముందు తాను ఎన్ని ఇబ్బందులు పడవలసి వచ్చిందో ప్రజల ముందు గోడు వెలిబుచ్చారు తప్ప విజయం సాధిస్తే తమ పార్టీ ఏం చేస్తుందో చెప్పలేక పోయారు. నవాజ్ సొంత రాష్ట్రమైన పంజాబ్ లో ఎక్కువ సీట్లు సంపాదించ గలిగారు. పాకిస్థాన్ లో ప్రస్తుతం ఉన్న వాస్తవ పరిస్థితిని గ్రహించడంలో నవాజ్, బిలావల్ భుట్టో కూడా విఫలమయ్యారు. నవాజ్ లాప్‌టాప్ లు ఇస్తాను, విద్యా సంస్థలు ఏర్పాటు చేస్తాను, ఉద్యోగాలు కల్పిస్తాను అని ప్రచారం చేశారు తప్ప రాజకీయ భవిష్యత్ చిత్రపటం ఎలా దిద్ది తీర్చుతారో మాత్రం చెప్పలేక పోయారు. ఇమ్రాన్ మీద జనం పెట్టుకున్న ఆశలను సైన్యం వమ్ము చేసింది. ఇమ్రాన్ పార్టీ మినహా మిగతా రెండు పార్టీలు వంశ పారంపర్యానికి ప్రాధాన్యం ఇచ్చేవే. వ్యక్తిగతంగా తన పరిస్థితి ఏమిటి అన్న అవగాహన ఉన్నందువల్ల తన తమ్ముడు షాబాజ్ షరీఫ్‌ను ప్రధానమంత్రి స్థానంలో కూర్చోబెట్టాలనుకుంటున్నారు. తమ బలహీనత తెలిసిన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నాయకుడు ప్రధానమంత్రి పదవి కోసం పేచీ పెట్టకపోవడం గుడ్డి కన్నా మెల్ల నయం అనుకోవాలి. నవాజ్ షరీఫ్ ఆలోచనల్లో ఏ మాత్రం కొత్తదనం లేదు. ప్రజల ఆకాంక్షలను అసలే పట్టించుకోలేదు. గతంలో ప్రధానమంత్రిగా పని చేసిన అనుభవం ఆయనకు ప్రస్తుతం ప్రజల ఆకాంక్షలు తీర్చడానికి అనువైన మార్గం చూపించలేక పోయింది. పాకిస్థాన్ ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఏదో ఒక రాజకీయ పార్టీ నాయకుడిని సమర్థిస్తూ ఉంటుంది. గతంలో ఇమ్రాన్ ఖాన్ ను ప్రోత్సహించింది కూడా పాక్ సైన్యమే. ఆ తరవాత ఇమ్రాన్ సైన్యాన్ని విమర్శించడం మొదలు పెట్టారు. ఇంతకు ముందు నవాజ్ షరీఫ్ కూడా అదే పని చేసేవారు. ఇప్పుడు ఆయన సైన్యాధిపతులకు ప్రియ మిత్రుడై పోయారు. నవాజ్ చేతిలో ప్రభుత్వ పగ్గాలు ఉండడం ఇప్పుడు పాకిస్థాన్ కు నచ్చొచ్చు. ఆ ప్రభుత్వం సంకీర్ణ ప్రభుత్వమే కాక బలహీనమైందిగా ఉంటుంది కనక సైన్యానికి నచ్చడంలో ఆశ్చర్యం లేదు. అయితే పాకిస్థాన్ లో అనిశ్చిత పరిస్థితి కొనసాగడం మాత్రం ఖాయం. ప్రభుత్వ ఏర్పాటులోనే అనేక సమస్యలు తలెత్తే సూచనలున్నాయి. ఇల్లలకగానే పండగ కానట్టు కొత్త ప్రభుత్వం ఏర్పడితే పాకిస్థాన్ గట్టెక్కుతుందన్న హామీ లేదు. ఇమ్రాన్ ఖాన్ వద్ద ఇబ్బందులే కొత్త ప్రభుత్వాధినేతలు పడక తప్పదు.

మన రక్షణ వ్యవస్థ బలోపేతం

భారత్ అమ్ముల పొదిలోకి అధునాతన ఆయుధాలు జలమార్గాల్లో మెరుగుపడనున్న నిఘా సహకారానికి అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ఆమోదం తెలిపింది. మన దేశానికి పక్కలో బల్లెంలా మారిన పాక్, చైనా లాంటి దేశాలకు దడ పుట్టించే ప్రిడేటర్ డ్రోన్స్ దూసుకొస్తున్నాయి. భారత్ చేతిలో ఈ డ్రోన్స్ అస్త్రాలు శత్రువుల వెన్నులో వణుకు పుట్టించనున్నాయి. భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా ఈ శుభవార్త అందించింది. భారత్‌కు 31 ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్లను విక్రయించేందుకు బైడెన్ ప్రభుత్వ యంత్రాంగం ఆమోదం తెలిపింది. దాదాపు 4 బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందంలో భారత్‌కు ఎంక్యూ-9బీ సాయుధ డ్రోన్ల అమ్మకానికి అమెరికా ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదిత విక్రయం అమెరికా-భారత వ్యూహాత్మక సంబంధాన్ని బలోపేతం చేయడానికి, రాజకీయ స్థిరత్వం, శాంతికి ముఖ్యమైన శక్తిగా కొనసాగనుంది. ఈ మేరకు అమెరికా కాంగ్రెస్‌కు నోటిఫై చేస్తూ అవసరమైన ధ్రువీకరణను అందజేసినట్లు డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) పేర్కొంది. ఈ నిర్ణయంతో దాదాపు 4 బిలియన్ డాలర్లు విలువైన భారీ ఒప్పందానికి ముందడుగు పడింది. అమెరికా నుంచి కొనుగోలుచేసే డ్రోన్ల వల్ల భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. తద్వారా జల మార్గాల్లో గస్తీ, నిఘా మెరుగుపడుతుంది. గత ఏడాది జూన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఎంక్యూ-9బీ డ్రోన్ల ఒప్పందంపై ప్రకటన చేశారు. "మానవరహిత విమానాలను భారత్‌కు విక్రయించడం వల్ల అమెరికా విదేశాంగ విధానానికి ఊతం లభిస్తుంది. రెండు దేశాల వ్యూహాత్మక మైత్రిని బలోపేతం చేయాలన్న జాతీయ భద్రతా లక్ష్యాలను నెరవేరుస్తుంది. మన ప్రధాన రక్షణ భాగస్వామి, ఇండో-పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతంలో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక పురోగతికి చాలా కీలకమైన భారత భద్రతను మెరుగుపరుస్తుందని అమెరికా డీఎస్‌సీఏ వెల్లడించింది. ప్రతిపాదిత విక్రయం సముద్ర మార్గాలలో మానవ రహిత నిఘా, నిఘా పెట్రోలింగ్ చేపట్టడం ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు బెదిరింపులను ఎదుర్కోగల భారత్ సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. భారత్ తన మిలిటరీని ఆధునీకరించడంలో నిబద్ధతను ప్రదర్శించింది. ఈ లోహవిహంగాలు, సేవలను తన సాయుధ దళాలలోకి చేర్చుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని పేర్కొంది. అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ ఆమోదం : భారత్‌కు 31 సాయుధ 'ఎంక్యూ-9బీ' డ్రోన్‌లను అమ్మే ఒప్పందానికి అమెరికా విదేశీ వ్యవహారాలశాఖ ఆమోదం తెలిపింది. ఈ డ్రోన్లతోపాటు వీటికి అమర్చే క్షిపణులు, ఇతర నిఘా పరికరాలను కూడా భారత్‌కు అందివ్వనున్నట్లు అమెరికా రక్షణశాఖ తెలిపింది. సుమారు రూ.33 వేల కోట్ల (నాలుగు బిలియన్ డాలర్ల) విలువైన ఈ ఒప్పందంపై చాలా ఏళ్లుగా భారత్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నాయి. సైనిక అవసరాల కోసం ఈ డ్రోన్‌ల కొనుగోలుపై భారత్ 2018 నుంచి ప్రత్యేక ఆసక్తి కనబరిచింది. ఆయుధాల కొనుగోళ్లలో రష్యాకు దగ్గరవుతున్న భారత్‌ను తమవైపు తిప్పుకునే ప్రయత్నంగా అమెరికా ఆమోదాన్ని చూస్తున్నారు. డ్రోన్ల కొనుగోలుకు అమెరికా సమ్మతి లభించడంతో భారత్‌కు పెద్ద అడ్డంకి తొలగిందనే చెప్పొచ్చు. ఎందుకంటే ఈ ఒప్పందానికి సమ్మతి తెలపాలంటే, "అమెరికాలో సిక్కు వేర్పాటువాద నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్య కుట్ర"పై భారత్ దర్యాప్తు చేయాలని అమెరికా చట్టసభ సభ్యులు గత సంవత్సరం డిమాండ్ చేశారు. హత్య కుట్ర విచారణకు సంబంధించి అమెరికా ప్రభుత్వం నుంచి హామీ లభించడంతో తమ వైఖరిని మార్చుకున్నామని డెమొక్రటిక్ ఎంపీ బెన్ కార్డిన్ చెప్పారు. డ్రోన్ల విక్రయ ఒప్పందాన్ని ఆమోదిస్తూ అమెరికా రక్షణ భద్రతా సహకార సంస్థ గురువారం అక్కడి పార్లమెంటులో ప్రకటన చేసింది. ఈ డ్రోన్ల కాంట్రాక్ట్‌ను 'జనరల్ అటమిక్స్ ఏరోనాటికల్ సిస్టమ్స్' కంపెనీకి అప్పగించినట్లు పెంటగాన్ తెలిపింది. ఈ ఒప్పందంలో భాగంగా భారత్‌కు 31 సాయుధ ఎంక్యూ-9బీ స్కైగార్డియన్ డ్రోన్‌లు, కమ్యూనికేషన్, నిఘా పరికరాలు అందించనున్నారు. వీటిలో 170 ఏజీఎం-114ఆర్ హెల్‌ఫైర్ క్షిపణులు, చిన్న వ్యాసం గల 310 లేజర్ బాంబ్‌లు, కచ్చితత్వంతో పనిచేసే గైడ్ బాంబులు కూడా ఉన్నాయి. భారత్ పంపించే ఎల్‌వోఆర్‌కు అమెరికా కాంగ్రెస్ స్పందించి ఫారెన్ మిలటరీ సేల్స్ కార్యక్రమం కింద లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ (ఎల్‌వోఏ) జారీ చేస్తుంది. మరో వైపు భారత్‌లో భద్రతా వ్యవహారాలపై కేంద్ర కమిటీ ఆమోద ముద్ర వేశాకే జనరల్ అటమిక్స్‌తో తుది ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆ కంపెనీ భారత్‌లో మరమ్మతులు, నిర్వహణ, ఓవర్‌హాల్ (ఎంఆర్‌వో) కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టుపై సంతకం చేసిన తొలి రెండేళ్లలోనే కనీసం 10డ్రోన్లను అందుకొనే అవకాశం ఉందని భారత్ ఆశిస్తోంది. ఆ తర్వాత ప్రతి ఆరు నెలలకు కొన్ని డ్రోన్లు చొప్పున దళాల్లో చేర్చే అవకాశం ఉందని రక్షణశాఖ అంచనా వేస్తోంది.

– ఇస్కా రాజేష్ బాబు, 9397399298

రేపు గ్రామీణ భారత్ బంద్ సక్సెస్ చేయాలి

చలసాని వెంకటరామారావు

గత పదేళ్లుగా నరేంద్ర మోదీ పాలనలో రైతుల, కార్మికుల ఆదాయాలకు బదులు కష్టాలు రెట్టింపయ్యాయి. రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. సోషలిస్టు, సెక్యులర్ దేశం అని రాజ్యాంగంలో పొందుపర్చుకున్న లక్ష్యాలకు భిన్నంగా వ్యవసాయాన్ని, పారిశ్రామిక రంగాన్ని కొద్దిమంది పెట్టుబడిదార్ల పరం చేస్తున్నారు. రైతులు, కార్మికుల శ్రమ వల్ల కేంద్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నది. ఎండ, వానలను లక్ష్యపెట్టకుండా రాత్రింబవళ్లు శ్రమచేసే రైతులకు కనీసమద్దతుధర ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం నిరాకరిస్తున్నది. అందరికీ అన్నంపెట్టే రైతులు, శ్రామికులు అర్థాకలితో, పస్తులతో కాలం వెళ్లబుచ్చవలసివస్తున్నది. సంవత్సరాల తరబడి పోరాటంచేసినా పాలకుల నిర్ణయంవల్ల పంటపొలాలను ఆశ్రయించి ఉండవల్సిన రైతులు ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నిమిత్తం దిల్లీ మహానగరం చుట్టుముట్టవలసిన అనివార్య పరిస్థితులను ప్రభుత్వం కల్పించింది. సంయుక్త కిసాన్ మోర్చా నేతృత్వంలో 13మాసాలపాటు మూడు వ్యవసాయచట్టాలను రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ 200 రైతు సంఘాలు చారిత్రాత్మకమైన పోరాటాన్ని దిల్లీ సరిహద్దులలో నిర్వహించారు. చిట్టచివరకు ప్రభుత్వం రైతుల పోరాటానికి లొంగివచ్చి రైతుసంఘాలతో చర్చించి మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేసింది. కనీసమద్దతు ధర, విద్యుత్ సవరణబిల్లు, మరికొన్ని ఇతర సమస్యలు విషయంలో రాతపూర్వక హామీలు ప్రభుత్వం ఇచ్చింది. కానీ ఆ తరువాత ఆ హామీలను ప్రభుత్వం గాలికి వదిలివేసింది. సాగునీటి వనరులు లేక, ప్రాజెక్టుల నిర్మాణం ఏళ్లతరబడి పూర్తిగాక, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే రీతిలో పంటల బీమా పథకం లేక, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఎరువులు, పురుగుమందుల సరఫరా సక్రమంగా లేక రైతులు అప్పులుపాలై గ్రామీణ ఆర్థికవ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. రైతుల వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపైనప్పటికీ తగిన ఆదాయం రాక దేశ రైతాంగం దివాళా స్థితికి చేరిపోయింది. ఈ స్థితిలో ప్రభుత్వం గతంలో చేసిన వాగ్దానాలను అమలుచేయాలని కోరుతూ గత సంవత్సర అన్నిరాష్ట్రాల రాజధానులలో, కేంద్రపాలిత ప్రాంతాలలో పెద్దఎత్తున 30రోజులపాటు కార్మికులు, రైతులు గవర్నర్ల కార్యాలయాలవద్ద పెద్ద ఎత్తున 'మహాపడావ్' నిర్వహించి ప్రభుత్వానికి తమ సమస్యలను ఏకరువు పెట్టడం జరిగింది. అయినా ప్రభుత్వంలో చలనంలేదు. తిరిగి జనవరి 26న దేశవ్యాపితంగా రైతు, కార్మిక సంఘాలు ట్రాక్టర్లతో నిరసన ప్రదర్శనలను నిర్వహించినా ప్రభుత్వం కళ్లు తెరవలేదు. దీనితో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల జాతీయ వేదికలు సంయుక్తంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా 'గ్రామీణ భారత్ బంద్' జరపాలని పిలుపునివ్వటం జరిగింది.

దేశంలో రైతాంగం ఆందోళనలను, అసంతృప్తులను పసికట్టిన మోదీ ప్రభుత్వం వారి ఉద్యమసెగపై నీళ్లు చల్లాలనే కుట్రతో వ్యవసాయ సంస్కరణలకు ఆధ్యుడు, వ్యవసాయ శాస్త్రవేత్త డా.ఎం.ఎస్ స్వామినాథన్‌కు, మరో ఉత్తరాది ప్రముఖ రైతు నాయకుడు, మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌లకు 'భారత రత్న' ఇచ్చి గౌరవించింది. డా.స్వామినాథన్ సిఫార్సులు అమలుచేయకుండా, వారు సూచించని విధంగా రైతులు

పండించిన పంటలకు కనీసమద్దతు ధరను ప్రకటించకుండా డా.స్వామినాథన్‌కు భారతరత్న ఇస్తే అది వారిని గౌరవించినట్టా అని దేశ రైతాంగం పాలకులను ప్రశ్నిస్తున్నారు. చరణ్‌సింగ్ ఉత్తరప్రదేశ్‌లో రైతాంగ హక్కులకోసం నిర్విరామంగా శ్రమించారు. వారి ఆశయాలకు అనుగుణంగా రైతు సంస్కరణలు తేకుండా వ్యవసాయ రంగాన్ని, రైతులను నాశనంచేసే కాంట్రాక్టు వ్యవసాయ విధానం, కార్పొరేట్‌ల దోపిడీనిమిత్తం రైతుల చేతులకు సంకెళ్లువేసే చర్యలకు పాల్పడేవారికి భారతరత్న ఇవ్వటంలో అర్థంలేదు.

దేశంలో రైతులు, కార్మికులు చారిత్రక రైతు పోరాటం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లిఖితపూర్వక హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. ఈ పోరాటంలో అమరులైన రైతులకు 'సింగు' సరిహద్దు వద్ద స్మారక చిహ్నం నిర్మించాలని కోరుతున్నారు. చనిపోయినవారి కుటుంబాలకు పరిహారం, పునరావాసం కల్పించాలని పెండింగ్‌లో ఉన్న కేసులను ఎత్తివేయాలని, రైతులను జీపుతో తొక్కించి చంపిన కుట్రలో భాగస్వామి అజయ్‌మిశ్రాని ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంకా రైతులకు విత్తనాలు, ఎరువులు విద్యుత్‌పై సబ్సిడీని పెంచాలని కోరుతున్నారు. కనీసమద్దతు ధరకు చట్టబద్దత కల్పించాలని, రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని రైతులు పట్టుబడుతున్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులు అమలుచేస్తూ అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడి రుణాలు చెల్లించలేని పరిస్థితులలో కమిటీనివేసి విచారణ జరిపించి రుణాలు రద్దు, లేదా వాయిదా వంటి వెసులుబాటు కల్పిస్తున్నది. ఇటువంటి వెసులుబాటు కేరళ తరహాలో దేశమంతా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. కార్పొరేట్ ఆనుకూల ప్రధానమంత్రి పంట బీమా పథకాన్ని ఉపసంహరించి, గ్రామం ప్రాతిపదికిన అన్ని పంటలకు ఉచిత సమగ్ర బీమా పథకం తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఇక కార్మికులకు సంబంధించి లేబర్‌కోడ్‌లను ఉపసంహరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని బలోపేతం చేయాలని, అమ్మకం నిలిపివేయాలని అన్ని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దేశ వ్యాప్తంగా కనీసవేతనం 26వేలకు తగ్గకుండా ఇవ్వాలని, స్కీం కార్మికులను కూడా దీని పరిధిలోకి తేవాలని వారు కోరుతున్నారు. ప్రతి కార్మికునికి సంఖ్యతో నిమిత్తం లేకుండా పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు 16వ తేదీ గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చాయి. మరో ప్రక్క కిసాన్ మజ్దూర్ మోర్చా మరికొన్ని సంస్థలు 13వ తేదీ 'చలో దిల్లీ' పిలుపునిచ్చాయి. ఆ మేరకు 13వ తేదీ పంజాబ్, హరియానా, ప్రాంతాల నుండి 2500 గూడు ట్రాక్టర్లలో ఆహారపదార్థాలతోపాటు దీర్ఘకాలం ఆందోళనకు సిద్ధమై 90వేల మంది రైతులు దిల్లీ బయలుదేరారు. కేంద్రపాలకులు అడుగడుగునా రైతులకు ఆటంకాలు సృష్టించారు. రోడ్లకు అడ్డంగా కాంక్రీటు గోడలు నిర్మించారు. పోలీసుల బలప్రయోగం, భాష్ప వాయుగోళాల ప్రయోగంతో దిల్లీ సరిహద్దులు ఉద్రిక్తంగా మారిపోయాయి. రైతులపై వాటర్‌క్యానన్‌లను ప్రయోగించారు. ఈ దాడిలో పలువురు రైతులు గాయపడినట్లు వార్తలువచ్చాయి. హర్యానా బీజేపీ ప్రభుత్వం 16జిల్లాలలో 144వ సెక్షన్ విధించి, 64 కంపెనీల పారామిలిటరీ దళాలను, 50 కంపెనీల పోలీసులను వినియోగించి నిరంకుశంగా రైతు ఉద్యమాన్ని అణచివేసేందుకు పూనుకుంది. అనేక ప్రాంతాలలో కాంక్రీట్ బారియర్లు, ముళ్లకంచెలు, జలఫిరంగులు రైతులపై ప్రయోగించారు. పంజాబ్, హరియానా, సరిహద్దు 'శంభు వద్ద పదివేలమంది రైతులకు, పోలీసులకు మధ్య సంకుల సమరం జరిగింది. రైతులపై డ్రోన్లద్వారా టియర్ గ్యాస్ ప్రయోగించటం జరిగింది. వాటర్‌క్యానన్లు, రబ్బరు బులెట్లను కూడా ప్రయోగించారు. హర్యానా ప్రభుత్వం రైతులను ఉగ్రవాదులలాగా చూచిందని, రాష్ట్రాన్ని కాశ్మీరులోయలా మార్చివేసిందని పలువురు వ్యాఖ్యానించారు.

ఆరుగాలం కష్టించి దేశానికి అన్నంపెట్టే రైతన్నల మీద ప్రభుత్వం పాశవికంగా దాడిచేయటం, ప్రజాస్వామ్య యుతంగా శాంతియుతంగా ఆందోళన చేయటానికి దేశరాజధానికి వెళుతున్న రైతులపై కర్కశంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుకు రైతు, కార్మికులు, ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేయాలి. పట్టుదలగా తమహక్కులకోసం 6మాసాలపాటు ఆహారధాన్యం, ఇతర అవసరాలతో సహా రాజధానికి బయలుదేరిన రైతు సోదరులకు ఆసేతు హిమాచల పర్యంతం రైతులు, ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలి. అందుకు ఫిబ్రవరి 16న రైతుసంఘాలు, కార్మిక సంఘాలు ఇచ్చిన 'గ్రామీణ భారత్ బంద్'ను జయప్రదం చేయాలి. రానున్న సార్వత్రిక ఎన్నికలలో రైతు, కార్మిక హక్కులను హరించిన పాలకులకు తగిన బుద్ధి చెప్పాలి. రైతులకిచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా వారిపట్ల నిర్దయగా వ్యవహరించిన పాలకుల వైఖరికి ప్రజలు బ్యాలెట్ ద్వారా సరైన సమాధానం చెప్పాలి. రైతు కంటి కన్నీరు జాతికే కళంకం తెస్తుంది. రైతులను చిన్నచూపు చూసిన ఏ పాలకులకు పాలించే అర్హతలేదు. ఏనాటికైనా రైతేరాజు కావాలి..

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
ఫోన్: 9490952093

ఎన్నికల బాండ్ల తీర్పుపై ఎదురుచూపు

కె.రవీంద్రన్

ఎన్నికల బాండ్ల కొనుగోలుతో బీజేపీ అనేక వందల కోట్ల ధనం సమీకరించి ఎన్నికల్లో ఖర్చు చేయడం ద్వారా ఎంతగానో ప్రయోజనం, లబ్ధి పొందుతుందని ఈ బాండ్లు చెల్లుబాటు కాకుండా తీర్పు ఇవ్వాలని అనేక మంది ప్రజాస్వామ్య అనుకూల కార్యకర్తలు, ఆసక్తిపరులు అనేక పిటీషన్‌లను గత నవంబరులో సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. ఈ పిటీషన్‌లపై ఇంకా విచారణ కొనసాగుతోంది. ఎన్నికలు జరిగే ప్రతిసారి బాండ్లను విక్రయించడం ద్వారా అన్ని పార్టీల కంటె ఎక్కువగా బీజేపీనే ప్రయోజనం పొందుతోంది. అందువల్ల ఈ బాండ్ల చెల్లుబాటును తిరస్కరించాలని ఇప్పుడు జరుగుతున్న బాండ్ల విక్రయం న్యాయమైనది కాదని, దీనికంటె మరింత న్యాయమైన విధానాన్ని సుప్రీంకోర్టు రూపొందించి ప్రకటించాలని కూడ పిటీషన్‌దారులు కోరారు. దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే బాండ్ల కొనుగోలు వ్యవహారాన్ని అనుమతించరాదని పిటీషన్‌దారులు విజ్ఞప్తి చేశారు. పాలక పార్టీ అక్రమ మార్గంలో నిధులను సేకరిస్తున్నారని అందువల్ల బాండ్లను రద్దు చేయాలని తమ పిటీషన్‌లలో కోరారు. బీజేపీ తర్వాత పెద్ద పార్టీ అయిన ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పాలక బీజేపీ పొందుతున్న నిధులలో పదింట ఒకటవ వంతు మాత్రమే కాంగ్రెస్ పొందుతున్నది. ఇతర జాతీయ పార్టీలు కాంగ్రెస్ కంటే మరింత తక్కువ నిధులను పొందుతున్నాయి. ఇతర రాజకీయ పార్టీలు పరిపాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టి తమ ప్రభుత్వాలను ఏర్పర్చుకునేందుకు బీజేపీ ఎన్నికల బాండ్ల ద్వార నిధులను సమీకరించి వాటిని ఖర్చు చేస్తున్నదని పిటీషన్‌లలో వివరించారు. అన్ని రాజకీయ పార్టీలకు ఒకే విధంగా ప్రయోజనం పొందటానికి వీలుగా మార్పులు చేయాలని కోరారు. రాజకీయ నిపుణులు, విశ్లేషకులు

బీజేపీ అక్రమ మార్గంలో నిధులను సమీకరిస్తున్నదని విమర్శ చేసినప్పటికీ పాలక పార్టీ ఏమాత్రం పట్టించుకోవటం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే మొదటిసారిగా ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందుతోంది. బీజేపీ ఇలాంటి పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు కలుగుతుందని పిటీషన్‌దారులు పేర్కొన్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చే మొత్తం నిధులలో కాంగ్రెస్‌కు పదవవంతు మాత్రమే లభిస్తుంది. ఎన్నికల బాండ్ల ద్వార లభించే నిధులను కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్‌లలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చివేసి కీలుబొమ్మ ప్రభుత్వాలని ఏర్పరచి పరోక్షంగా కేంద్ర ప్రభుత్వం పాలనను నడుపుతున్నదనేది చాలాకాలంగా ప్రజలకు తెలిసిందే. బీజేపీ విచ్ఛిన్నకర రాజకీయాలను అనుసరిస్తూ ఎన్నికల బాండ్లను గట్టిగా సమర్థిస్తోంది. 1998 లో ఇంద్రజిత్‌గుప్తా కమిటీ చరిత్రాత్మకమైన నివేదికను అనేక సిఫారసులతో న్యాయ కమిషన్‌కు అందజేసింది. ఎన్నికలకు న్యాయంగా ప్రభుత్వ నిధులను అందజేయటం ద్వారా న్యాయంగా ఎన్నికలను నిర్వహించడానికి వీలు కలుగుతుందని స్పష్టం చేస్తుంది. ఈ సిఫారసులపై చాలా కాలంగా చర్చ జరుగుతోంది. పాలక బీజేపీ ఈ నివేదికను అసలు బయటపెట్టలేదు. దీన్ని అంగీకరించటానికి కూడ సిద్ధంగా లేదు. ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫారసులలో రెండు పరిమితులను పేర్కొన్నది. ముందుగా గుర్తింపు కలిగిన జాతీయ, రాష్ట్ర స్థాయి పార్టీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కమిటీ కోరింది. ఇండిపెండెంట్ అభ్యర్థులకు నిధులు కేటాయించకూడదని ఆ కమిటీ సిఫారసు చేసింది. తక్కువ గడువు రాష్ట్ర నిధులను కేవలం గుర్తింపు పొందిన పార్టీలకు, లేదా అభ్యర్థులకు కొన్ని సౌకర్యాలను మాత్రమే కల్పించాలి. ఈ నివేదికను రూపొందించే సమయంలో దేశ ఆర్థిక పరిస్థితిని గమనించి ఎన్నికలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ నిధులను అందించకుండా పాక్షికంగా నిధులను అందజేయాలి. 1999 లో లా కమిషన్ ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫారసులను ఎక్కువ భాగం ఆమోదించింది. పాక్షికంగా నిధులు ఇవ్వడం సాధ్యమవుతుంది కాని పూర్తిగా ఇవ్వటం సాధ్యం కాదని లా కమిషన్ తెలియజేసింది. ఆయా పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించాలని ఖర్చుచేసిన నిధుల పూర్తి వివరాలను ఎన్నికల కమిషన్‌కి అందజేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఇంద్రజిత్‌గుప్తా కమిటీ సిఫారసులకు పదేళ్ల ముందు సంస్కరణల కమిషన్ పరిమితులకు లోబడి ఎన్నికల వ్యయాన్ని అందించాలని సిఫారసు చేసింది. అయితే 2001లో రాజ్యాంగంపై సమీక్షిస్తూ ఎన్నికలకు ప్రభుత్వం నిధులను సమకూర్చాలన్న సిఫారసు ఏమీ చేయలేదు. నిధులను సమకూర్చే సామర్థ్యం ప్రభుత్వాలకు ఉన్నదా లేదా అని కూడ సమీక్షించాలని కోరింది. నిధుల ఖర్చు విషయంలో పారదర్శకత ఉండాలని కమిషన్ కోరింది. దేశ ఎన్నికల వ్యవస్థపై సుప్రీంకోర్టు తగిన సిఫారసులను చేసే అవకాశం ఉంటుంది.

ఎంఎస్‌పీకి చట్టబద్ధత ఎందుకివ్వరు?

మోదీసర్కార్‌ను నిలదీసిన కాంగ్రెస్

గాయపడ్డ రైతుకు రాహుల్ ఫోన్

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)పై చట్టం చేసే విషయంలో కేంద్రంలోని మోదీ సర్కారు ఎందుకు పారిపోతోందని కాంగ్రెస్ నిలదీసింది. మోదీ ప్రభుత్వంపై రైతులు విశ్వాసం కోల్పోయారని పేర్కొంది. రైతు సంఘాల 'చలో దిల్లీ' మార్చ్ సందర్భంగా పోలీసు చర్యలో గాయపడ్డ రైతు గుర్మీత్ సింగ్‌తో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఫోన్‌లో సంభాషించారు. దేశంలో అన్నదాతలపై మోదీ సర్కారు నియంతృత్వ వైఖరిని అవలంబిస్తోందని రాహుల్ విమర్శించారు. గుర్మీత్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. తాము రైతుల పక్షాన ఉన్నామని భయపడ వద్దని ధైర్యం చెప్పారు. గుర్మీత్ చికిత్స పొందుతున్న పాటియాలా జిల్లాలోని రాజ్‌పుర పట్టణ ఆస్పత్రికి వెళ్లిన పంజాబ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమరీందర్ రాజా ఆయన్ని పరామర్శించారు. హరియాణా పోలీసులతో జరిగిన ఘర్షణలో గుర్మీత్ గాయపడ్డారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల్లో పోలీసులు దాడిలో 60 మంది గాయపడ్డారని రైతులు చెబుతున్నారు. మరోవైపు నిరసనకారులు రాళ్లు విసరడంతో డీఎస్పీ సహా 24 మంది పోలీసు సిబ్బంది గాయపడినట్లు హరియాణా పోలీసులు వెల్లడించారు. కాగా పదే పదే వాగ్దానాలు చేసినప్పటికీ పంటలకు కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీ ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం ఎందుకు పారిపోతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా హిందీలో పోస్ట్ చేశారు. '2011లో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా, వర్కింగ్ గ్రూప్ చైర్మన్‌గా ఉండగా... అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఒక నివేదికను సమర్పించారు. అందులో రైతుల ప్రయోజనాలను రక్షించడానికి మనం చట్టపరమైన నిబంధనల ద్వారా హామీ ఇవ్వాలి. రైతు- వ్యాపారి మధ్య ఎటువంటి లావాదేవీలైనా ఎంఎస్‌పీ కంటే తక్కువగా జరగకూడదు అని తెలిపారు' అని ఆయన అన్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా అనేక బహిరంగసభల్లో స్వామినాథన్ కమిటీ ఫార్ములా ప్రకారం అన్ని ఖర్చులు పోగా...50 శాతం మార్జిన్‌తో అన్ని పంటలను ఎంఎస్‌పితో కొనుగోలు చేస్తామని మోదీ హామీ ఇచ్చారని రమేశ్ గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఏదీ జరగలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ ప్రకారం గోదుమ క్వింటాల్‌కు రూ.2,478 ఎంఎస్‌పీ ఇవ్వాల్సి ఉండగా ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.2,275 మాత్రమే ఉందని... అదేవిధంగా వరి ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.2,866కి బదులుగా రూ.2,183 మాత్రమే ఉందని తెలిపారు. 'మోదీజీ, మీరు మీ స్వంత (2011) నివేదికలోని అంశాలను ఎందుకు అమలు చేయలేదు? ఎంఎస్‌పి ఇస్తామని పదే పదే చెప్పి రైతులకు ఎందుకు మాయమాటలు చెప్పారు? మోదీ ప్రభుత్వంపై నేడు రైతులు విశ్వాసం కోల్పోయారు. స్వామినాథన్ ఫార్ములా ఆధారంగా రైతులకు ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే' అని జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు.

రాజకీయ ప్రేరేపితం బీకేఎస్

న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధన కోసం రైతులు తలపెట్టిన దిల్లీ చలో మార్చ్ రాజకీయ ప్రేరేరితమని ఆర్ఎస్ఎస్ అనుబంధ భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) పేర్కొంది. రైతులకు మద్దతివ్వలేని దిల్లీ చలోకు తాము మద్దతివ్వబోమని బీకేఎస్ ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల దృష్ట్యా రైతుల పేరిట రాజకీయాలు చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పేరిట ఎన్నికల వేళ రాజకీయ ఉద్దేశాలతో చేపట్టే ఉద్యమాలు హింసా, ఉద్రిక్తతకు దారితీస్తాయని, ఆస్తి నష్టానికి కారణమవుతాయని తెలిపారు. రైతులంటే ప్రతికూల భావన కలగజేస్తాయన్నారు. రైతులకు మద్దతు ధరలు, వ్యవసాయోత్పత్తులపై జీఎస్టీ రద్దు, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు, జీఎం-సీడ్ నిషేధం కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను వినియోగించుకోవడం కొందరి మనోభావాలను దెబ్బతీస్తాయన్నారు. రైతుల పేరిట రాజకీయ ఉద్యమాలతో నష్టపోయేది రైతులే అని మిశ్రా పేర్కొన్నారు. 2017లో మధ్యప్రదేశ్, మాండసౌర్ రైతుల ఆందోళ, 2020-21లో దిల్లీలో మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమమే ఇందుకు ఉదాహరణలన్నారు. అధికారంలో ఎవరున్నాగానీ రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని తెలిపారు. రైతులకు ప్రధాన సమస్యలుగా సీడ్, మార్కెట్ ఉన్నాయని, రైతులు దోపిడీకి గురవుతున్నారని, దీనికి వ్యతిరేకిస్తున్నామని మిశ్రా పేర్కొన్నారు.

డ్రోన్లకు పతంగులతో రైతుల చెక్

న్యూఢిల్లీ: రైతులు చేపట్టిన 'దిల్లీ ఛలో' నిరసన ప్రదర్శనను అడ్డుకునేందుకు దేశ రాజధానిలో అడుగుడుగునా భద్రతా ఏర్పాట్లు చేయడం, సెంట్రల్ దిల్లీతో హరియాణా సరిహద్దు పాయింట్ల వద్ద ఆంక్షలు విధించడంతో సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. భారీ భద్రత, కాంక్రీట్ బారికేడ్లను సైతం లెక్కచేయకుండా రైతులు ఛలో మార్చ్ కొనసాగిస్తుండటంతో శంభు సరిహద్దు వద్ద పెద్దఎత్తున రైతులు వేచిచూస్తున్నారు. ఇదేసమయంలో పతంగులు ఎగురవేస్తూ సందడి చేస్తున్నారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల వద్ద రైతులు పతంగులు ఎగురవేయడానికి ప్రత్యేక కారణం లేకపోలేదు. రైతు నిరసనకారులు బారికేడ్లు దాటడానికి మంగళవారం ప్రయత్నించినప్పుడు వారిపై పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు.

శంభు సరిహద్దు ప్రాంతం పంజాబ్‌లోనే ఉన్నప్పటికీ హరియాణా నుంచి డ్రోన్ ద్వారా టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నారంటూ పంజాబ్ ఆధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే శంభు సరిహద్దుల్లో రైతులు పెద్దఎత్తున గుమిగూడటంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు పంజాబ్ పరిధిలో ఉన్నందున డ్రోన్లు మోహరించకుండా సంయమనం పాటించాలని అంబాలా డిప్యూటీ కమిషనర్‌కు పాటియాలా డిప్యూటీ కమిషనర్ షౌకత్ అహ్మద్ పార్రే లేఖ రాశారు. కాగా, తాము పంజాబ్ ప్రాంతంలోనే ఉన్నప్పటికీ మానవ రహిత వాహనంలో గ్యాస్ కేనిస్టర్లను వదులుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని పార్రే ధ్రువీకరించారు. సరిహద్దుల వెంట డ్రోన్ల కదలికలను నియంత్రించాలని తాము కోరినట్టు చెప్పారు. ఈ క్రమంలో రైతులు శంభు సరిహద్దుల్లో డ్రోన్లు ఎగురకుండా పంతగులు ఎగురవేస్తున్నారు. అవసరమైతే డ్రోన్లను కిందకు దించేందుకు పట్టుదలగా ఉన్నారు.

అప్పుడెందుకు మద్దతు ధర ఇవ్వలేదు: బీజేపీ

న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని పంటలకు మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రకటనపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేత ప్రకాశ్ జవదేకర్ తప్పుపట్టారు. పంటలకు మద్దతు ధర ఇవ్వాలని ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిందని, కమిషన్ సిఫారసు చేసిన సమయంలో (2010) యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఆ సమయంలో ఎందుకు పంటలకు మద్దతు ధర ఇవ్వలేదని జవదేకర్ నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల వేళ రైతులు గుర్తొచ్చారా అని మండిపడ్డారు. స్వామినాథన్ సిఫారసుల గురించి అప్పటి మంత్రి కేవీ థామస్ రాజ్యసభలో చేసిన ప్రకటన ప్రతిని జవదేకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బ

మాజీ ప్రధాని మనవడు రాజీనామా

లక్నో: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరిగా పార్టీని వీడుతున్నారు. తాజాగా మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారు. తన ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ విషయాన్ని ఆయనే 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్ సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకున్నారు. 'నా ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలో చేరాను. లాల్ బహదూర్ నినాదమైన 'జై జవాన్, జై కిసాన్'ను మరింత బలోపేతం చేసేందుకు కాషాయ పార్టీలో భాగమయ్యా. మోదీ నాయకత్వంలో దేశానికి నావంతు కృషి చేస్తా' అని విభాకర్ పేర్కొన్నారు. కొద్దికాలంగా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. కేంద్ర మాజీమంత్రి మిలింద్ దేవ్‌రా ఇటీవల కాంగ్రెస్‌కు వీడ్కోలు పలికి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరారు. 48 ఏళ్లుగా పార్టీలో ఉన్న బాబా సిద్ధిక్ అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ గూటికి చేరారు. సీనియర్ నాయకుడు అశోక్ చవాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే.

బెంగాల్ బీజేపీ అధ్యక్షుడికి గాయాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్ బుధవారం గాయపడ్డారు. నార్త్ 24 పరగణాల జిల్లాలో మీడియాను ఉద్దేశించి కారు బోనెట్‌పై నిలబడి మాట్లాడుతుండగా ఆయన కిందపడ్డారు. దీంతో గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. సందేశ్‌కాళి వెళ్లేందుకు మంగళవారం ప్రయత్నించిన మజుందార్‌ను జిల్లాయంత్రాగం అడ్డుకుంది. దీంతో బషీర్‌హాట్ పోలీస్ స్టేషన్ ఎస్పీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆయనను టకిలోని గెస్ట్ హౌస్‌కు అర్ధరాత్రి తరలించారు. బుధవారం ఉదయం తిరిగి సందేశ్‌కాళి వెళ్లేందుకు ఆయన ప్రయత్నించినప్పటికీ గెస్ట్ హౌస్ విడిచివెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆయన మీడియాతో మాట్లాడుతుండగా కారు బోనెట్‌పై నుంచి జారి పడినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బషీర్‌హట్ సబ్ డివిజనల్ ఆసుపత్రికి ఆయనను తరలించారు. కాగా, రాష్ట్ర పోలీసులు తాను రాత్రి బస చేసిన లాడ్జిని దిగ్బంధం చేశారని మజుందార్ మీడియా ముందు ఆరోపించారు. గ్రామస్థులపై టీఎంసీ గూండాలు అకృత్యాలు చేస్తున్నారని, షెడ్యూల్ ప్రకారం బుధవారం మధ్యాహ్నం బాధితులను కలుసుకునేందుకు సందేశ్‌కాళి వెళ్లాల్సి ఉండగా తనను గృహనిర్బంధం చేశారని చెప్పారు. అయితే, ఆయన ఆరోపణలను పోలీసులు తోసిపుచ్చారు. ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేసేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు మజుందార్ ప్రయత్నాలు చేస్తున్నారని తృణమూల్ ప్రతినిధి కునాల్ ఘోష్ ఆరోపించారు.

విలీనం ప్రశ్నేలేదు: సుప్రియా సూలే

ముంబై: శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఏ రాజకీయ పార్టీలోనూ విలీనం కాబోదని ఆ పార్టీ లోక్‌సభ సభ్యురాలు సుప్రియా సూలే తేల్చిచెప్పారు. తమవర్గం ఏ రాజకీయ పార్టీలోనూ విలీనం కాదని, మహా వికాస్ అఘాడిలో భాగంగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని సూలే స్పష్టం చేశారు. పార్టీ అధినేత శరద్ పవార్ నివాసంలో జరిగిన సమావేశం అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం జరిగిన సమావేశం ర్యాలీకి సంబంధించిందని, ర్యాలీలో ప్రసంగించే నాయకుల పేర్ల గురించి చర్చ జరిగినట్లు ఆమె చెప్పారు. కాంగ్రెస్‌లో ఎన్సీపీ విలీనం కానుందన్న వార్తల నేపథ్యంలో సుప్రియా సూలే ఈ మేరకు స్పష్టత ఇచ్చారు. సమావేశంలో మాజీ మంత్రులు అనిల్ దేశ్‌ముఖ్, రాజేశ్ తోపేతో పాటు ఎంపీలు అమోల్ కోల్హే, శ్రీనివాస్ పాటిల్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్‌లో తమ వర్గం విలీనమయ్యే అవకాశం లేదని, తప్పుడు వార్తలను నమ్మవద్దని అనిల్ దేశ్‌ముఖ్ సూచించారు. కొత్త ఎన్నికల గుర్తు పొందాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొత్త పేరు-కొత్త గుర్తుతో ప్రజల్లోకి వస్తామని పేర్కొన్నారు. కాగా ఎన్సీపీకి మొత్తం 53 మంది ఎమ్మెల్యేలు ఉండగా, అజిత్ వర్గంగా చీలిన తర్వాత ఎన్సీపీపై శరద్ పవార్ నియంత్రణ కోల్పోతూ వచ్చారు. ప్రస్తుతం ఆయన వెంట 12 మంది ఎమ్మెల్యేలే ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ ఎవరిదనే విషయమై రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదాన్ని ఇటీవలే కేంద్ర ఎన్నికల సంఘం పరిష్కరించింది. అజిత్ పవార్ నేతృత్వంలోని వర్గాన్నే అసలైన ఎన్సీపీగా గుర్తించింది. ఆ పార్టీ ఎన్నికల గుర్తు గడియారం వారికే కేటాయించింది. శరద్ వర్గానికి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ- శరద్ చంద్ర పవార్ అనే పేరు ఖరారు చేసింది.

గుజరాత్ నుంచి నడ్డా, మహారాష్ట్ర నుంచి అశోక్ చవాన్

బీజేపీ రాజ్యసభ అభ్యర్థుల జాబితా విడుదల

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కీలక అభ్యర్థుల పేర్లను బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభకు పోటీ చేయనుండగా, ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన అశోక్ చవాన్‌ను మహారాష్ట్ర నుంచి రాజ్యసభకు ఎంపిక చేసింది. జేపీ నడ్డాతో పాటు గుజరాత్ నుంచి రాజ్యసభకు గోవింద్ భాయ్ ధోలకియా, మయాంక్ భాయ్ నాయక్, జస్వంత్ సిన్హ్ సలామ్‌సిన్హ్ పార్మర్ పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. మహారాష్ట్రలో అశోక్ చవాన్‌తో పాటు మేధా కులకర్ణి, అజిత్ గోప్చడేలను బీజేపీ నామినేట్ చేసింది.

యూపీ నుంచి ఏడుగురు నామినేషన్

బీజేపీ తరపున ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎన్నికల బరిలో దిగిన ఏడుగురు అభ్యర్థులు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సమక్షంలో బుధవారం నామినేషన్ వేశారు. వీరిలో కేంద్ర మాజీమంత్రి ఆర్‌పీఎన్ సింగ్, మాజీ ఎంపీ చౌదరి తేజ్‌వీర్ సింగ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదగర్శి అమ్రపాల్ మౌర్య, రాష్ట్ర మాజీ మంత్రి సంగీత బల్వంత్, పార్టీ ప్రతినిధి సుధాన్షు త్రివేది, మాజీ ఎమ్మెల్యే సాధనా సింగ్, ఆగ్రా మాజీ మేయర్ నవీన్ జైన్ ఉన్నారు. నామినేషన్ సందర్భంగా సీఎంతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర సింగ్ చౌదరి, ఉప ముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేశ్ పాఠక్, బీజేపీ యూపీ లోక్‌సభ ఇన్‌చార్జి బైజయంత్ పాండే హాజరయ్యారు. ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలు జరుగనుండగా, ఫిబ్రవరి 15వ తేదీతో నామినేషన్ల గడువు ముగియనుంది.

'ఒకదేశం, ఒకే ఎన్నిక'కు వ్యతిరేకం

అసెంబ్లీలో స్టాలిన్ తీర్మానం

చెన్నై: వివాదాస్పద ఒక దేశం, ఒకే ఎన్నిక(జమిలి) విధానానికి, తాజా జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీలో స్టాలిన్ ప్రభుత్వం బుధవారం రెండు తీర్మానాలు ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో స్టాలిన్ మాట్లాడుతూ ఒకదేశం, ఒకే ఎన్నిక సిద్ధాంతం ప్రజాస్వామ్య ప్రాతిపదికకు విరుద్ధమని, అసాధ్యమని, భారత రాజ్యాంగంలో పొందుపంచలేదని చెప్పారు. ఈ విధానాన్ని అమలు చేయవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజనను ఆమోదించలేమని అన్నారు. ఈ విధానాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులో మొత్తం 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుందని, ప్రస్తుతం 39 మంది ఎంపీలు ఉన్నా పార్లమెంటులో తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని తెలిపారు. ఒకవేళ ఇంకా తగ్గితే అది రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. జనగణన ఆధారంగా 2026 తర్వాత చేపట్టాల్సిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ఇప్పుడు చేపట్టవద్దని కేంద్రానికి విన్నవించారు. అనివార్య కారణాలతో, జనాభా ఆధారంగా స్థానాలు పెరిగితే... 1971 జనాభా ఆధారంగా నిర్ణయించిన రాష్ట్ర అసెంబ్లీలు, పార్లమెంటు ఉభయసభలలోని రాష్ట్రాల మధ్య నియోజకవర్గాలను ప్రస్తుత నిష్పత్తిలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీంతో గత 50 ఏళ్లుగా అనేక సామాజిక - ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అవలంబిస్తున్న తమిళనాడు వంటి రాష్ట్రాలపై జరిమానా పడుతుందని పేర్కొన్నారు. 'ఒకదేశం, ఒకే ఎన్నిక' విధానానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బీజేపీ వ్యతిరేకించింది.

ఉమర్ బెయిల్ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ: ఈశాన్య దిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్ల వెనుక కుట్రలో ప్రమేయం ఉందన్న ఆరోపణలపై ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కింద కేసు ఎదుర్కొంటున్న జేఎన్‌యూ మాజీ విద్యార్థి ఉమర్ ఖలీద్ బుధవారం సుప్రీంకోర్టు నుంచి తన బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాడు. మారిన పరిస్థితుల రీత్యా బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్లు ఖలీద్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ న్యాయమూర్తులు బేలా ఎం త్రివేది, పంకజ్ మిథాల్‌లతో కూడిన ధర్మాసనానికి తెలిపారు. సిబల్ మాట్లాడుతూ, 'నేను న్యాయపరమైన ప్రశ్న (ఉపా నిబంధనలను సవాలు చేస్తూ)పై వాదించాలనుకుంటున్నాను. అయితే పరిస్థితులలో మార్పు కారణంగా బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుకుంటున్నాను. మేము ట్రయల్ కోర్టులో మా అదృష్టాన్ని పరీక్షించుకుంటాము' అని పేర్కొన్నారు. అయితే బెయిల్ పిటిషన్ ఉపసంహరణకు గల కారణాలను సిబల్ వివరించలేదు. కాగా సిబల్ అభ్యర్థనను అంగీకరించిన ధర్మాసనం ఖలీద్‌ను బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. 2022 అక్టోబరు 18న తన బెయిల్ పిటిషన్‌ను దిల్లీ హైకోర్టు తిరస్కరించడాన్ని ఖలీద్ సవాలు చేశాడు. ఖలీద్ ఇతర సహ నిందితులతో నిరంతరం టచ్‌లో ఉన్నాడని, అతనిపై వచ్చిన ఆరోపణలు ప్రాథమికంగా నిజమని పేర్కొంటూ ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం కింద నిందితుడి చర్యలు 'ఉగ్రవాద చర్య'గా భావించబడతాయని హైకోర్టు పేర్కొంది. ఈశాన్య దిల్లీలో 2020 ఫిబ్రవరిలో జరిగిన అల్లర్లలో 53 మంది మృతి చెందగా... 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా అనేక మందిపై తీవ్రవాద ఉపా, ఐపీసీలోని అనేక నిబంధనల కింద కేసు నమోదైంది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)కి వ్యతిరేకంగా జరిగిన నిరసనల సందర్భంగా హింస చెలరేగింది. 2020 సెప్టెంబరులో దిల్లీ పోలీసులు ఖలీద్‌ను అరెస్టు చేశారు. హింసలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని, కేసులోని ఇతర నిందితులతో కుట్రపూరిత సంబంధం లేదని పేర్కొంటూ ఖలీద్ బెయిల్ కోసం ప్రయత్నించాడు. దిల్లీ పోలీసులు హైకోర్టులో ఖలీద్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకించారు.

మణిపూర్‌లో ఎదురు కాల్పులు

ఇంఫాల్: మణిపూర్, కక్చింగ్ జిల్లాలోని సుగ్నూ గ్రామంలో సాయుధులకు, ఆ గ్రామ వాలంటీర్లకు మధ్య బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. రెండు వర్గాల మధ్య భీకర పోరు సాగిందని, సాయుధలు కాల్పులకు తెగబడగా గ్రామ వలంటీర్లు ప్రతిఘటించారని పోలీసులు వెల్లడించారు. అయితే ఎవరికీ గాయాలు కాలేదన్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకు అదనపు భద్రతా సిబ్బందిని ఆ ప్రాంతంలో మోహరించినట్లు తెలిపారు. గత మేలోనూ సుగ్నూలో హింస జరిగింది. అనేక ఇళ్లు మంటల్లో బుగ్గి కాగా ఐదుగురు చనిపోయారు. వందలాది మంది నిరాశ్రులయ్యారు. మంగళవారం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని పుఖావో శాంతిపూర్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. 25ఏళ్ల గ్రామ వలంటీర్ హత్యకు గురి కాగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. జిల్లాలోని వేరొక ఘటనలో ఆర్మీ అధికారికి బుల్లెట్లు తగిలాయి. పరిస్థితిని అదుపు చేసే క్రమంలో ఆయన గాయపడ్డారు. గతేడాది మే 3న మణిపూర్‌లో వర్గపోరు మొదలైంది. అప్పటి నుంచి 180 మంది ప్రాణాలు కోల్పోయారు.

తల్లికి డబ్బులివ్వడం గృహ హింస కాదు

సెషన్స్ కోర్టు కీలకతీర్పు

ముంబై: తన భర్త, అత్తమామలపై చేసిన ఫిర్యాదుపై మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను ముంబైలోని సెషన్స్ కోర్టు కొట్టివేసింది. ఒక వ్యక్తి తన తల్లికి సమయం, డబ్బు ఇవ్వడం గృహ హింసగా పరిగణనలోకి రాదని స్పష్టం చేసింది. దిండోషి కోర్టు అదనపు సెషన్స్ జడ్జి ఆశిష్ అయాచిత్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.నా మహిళ చేసిన ఆరోపణలు అస్పష్టంగా, అవాస్తవంగా ఉన్నాయన్నారు. వారు గృహ హింసకు పాల్పడ్డారని నిరూపించడానికి అవసరమైన ఆధారాలు లేవని చెప్పారు. మహారాష్ట్ర సచివాలయం మంత్రాలయలో పని చేస్తోన్న ఓ మహిళ... గృహ హింస నుంచి రక్షణతో పాటు పరిహారం డిమాండ్ చేస్తూ కోర్టులో పిటిషన్ వేసింది. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి ఆరోగ్యం గురించి అవాస్తవాలు చెప్పి తన భర్త తనను పెళ్లి చేసుకున్నాడని ఆరోపించింది. తాను ఉద్యోగం చేయడం ఆమెకు ఇష్టం లేదని, తరచూ తనతో గొడవ పడే వారని పిటిషన్‌లో పేర్కొంది. 1993 నుంచి 2004 వరకు తన భర్త విదేశాల్లో ఉద్యోగం చేశారని, సెలవుపై భారత్‌కు వచ్చినప్పుడల్లా తన తల్లి వద్దకు వెళ్లి ఆమెతో సమయం గడపడమే కాకుండా రూ.10,000 ఇచ్చేవారని ఫిర్యాదులో జత చేసింది. అంతే కాకుండా ఆమె కంటి ఆపరేషన్ కోసం చాలా డబ్బు ఖర్చు పెట్టాడని ఆవేదన వ్యక్తం చేసింది. అత్తతో పాటు భర్త కుటుంబీకులు సైతం వేధిస్తున్నారని వాపోయింది. వారి వేధింపుల కారణంగా తన భర్త నుంచి విడాకులు కోరుతూ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ కేసుపై విచారణ జరిపిన ట్రయల్ కోర్టు (మేజిస్ట్రేట్) నెలకు 3,000 మధ్యంతర భరణం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా ఈ కేసును ప్రత్యేకంగా విచారించిన సెషన్స్ కోర్టు ఆ మహిళ పిటిషన్‌ను కొట్టేసింది. విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో ఆమెకు మంజూరు చేసిన మధ్యంతర ఆదేశాలు, మినహాయింపులను రద్దు చేసింది.

నాలుగేళ్లలో 62 జననాలు

ఖైదీల్లో గర్భిణులు అధికం

బెంగాల్ జైళ్లపై సుప్రీంకోర్టుకు వివరణ

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ జైళ్లలో మహిళా ఖైదీలు గర్భం దాల్చుతున్నట్లు వచ్చిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు దీనిపై సమగ్ర విచారణకు ఆదేశాలిచ్చింది. ఇదే క్రమంలో అమికస్ క్యూరిగా సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ నియమితులయ్యారు. 'బెంగాల్‌లోని 1,382 జైళ్లలో అమానవీయ పరిస్థితులు' శీర్షికన కోర్టుకు దరఖాస్తు అందజేశారు. గత నాలుగేళ్లలో పశ్చిమ బెంగాల్ జైళ్లల్లో 62 మంది శిశువులు జన్మించారని తెలిపారు. ఖైదీల్లో గర్భిణులు ఎక్కువ మంది ఉన్నట్లు వెల్లడించారు. కస్టడీలో జన్మించిన శిశువుల వివరాలను బెంగాల్ ఏడీజీ, ఐజీ కరెక్షనల్ సర్వీసెస్ నుంచి సేకరించినట్లు అగర్వాల్ తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 5.32గంటలకు అందిన సమాచారం ప్రకారం నాలుగేళ్లలో 62 మంది శిశువులు జన్మించారని, జైళ్లకు తరలించే సమయంలో చాలా మంది ఖైదీలు గర్భిణులుగా ఉన్నారన్నారు. పెరోల్‌పై వెళ్లిన కొందరు గర్భిణులుగా తిరిగి వచ్చినట్లు వెల్లడించారు. మహిళల జైళ్లు, బరాక్‌లలో భద్రతపై రాజస్థాన్, హరియాణా, దిల్లీ జైళ్ల అధికారులతో చర్చించినట్లు తెలిపారు. దిల్లీ తీహార్ జైలుతో సహా అనేక చోట్ల మహిళా జైళ్లు విడిగా ఉన్నాయని, మగ సిబ్బందికి ఆ జైళ్లలోకి ప్రవేశం ఉండదని చెప్పారు. అనివార్యమైతే తప్ప మగ డాక్టరు లేక మగ అధికారి సందర్శిస్తారని, వారి వెంట మహిళా గార్డ్ తప్పనిసరిగా ఉంటారని పేర్కొన్నారు. మహిళా జైళ్లు, మహిళా బారక్‌ల భద్రతా ఆడిట్ నిర్వహించడమే కాకుండా వైద్య సౌకర్యాలనూ సమీక్షించాలన్నారు. మహిళా జైళ్ల తనిఖీ కోసం జిల్లాలోని సీనియర్ మహిళా న్యాయాధికారిని కోరవచ్చని, ఆమె వెంట అత్యంత సీనియర్ మహిళా పోలీసు అధికారి, జైలు సూపరింటెండెంట్ ఉండాలని అమికస్ క్యూరి అగర్వాల్ పేర్కొన్నారు. మహిళా ఖైదీలకు క్రమంగా వైద్య పరీక్షలు నిర్వహించడం అవసరమని నొక్కిచెప్పారు.

సీఎంకు ఇదే చివరి అవకాశం

- అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోండి
- ముప్పాళ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి
- నేడు విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల న్యాయపోరాట దీక్ష

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): ప్రతిపక్ష నేతగా 2017లో అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా శిబిరానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... ఆనాడు ఇచ్చిన హామీని ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం చేపట్టిన వెంటనే వారం రోజుల్లో రూ.20వేలు లోపు డిపాజిట్‌దార్లకు చెల్లింపులు చేస్తానని, ఆ తర్వాత ఆరు మాసాల్లోపే మొత్తం బాధితులకు వడ్డీతో సహా చెల్లింపు చేస్తానని జగన్‌మోహన్ రెడ్డి నాడు ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు ఆయన ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. పైగా ఇచ్చిన హామీని అమలు చేయమని కోరుతూ శాంతియుతంగా దీక్షలు, ధర్నాలు చేసుకునే అవకాశం కూడా లేకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 15వ తేదీ అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో నిర్వహించే న్యాయ పోరాట దీక్షను భగ్నం చేసేందుకు వివిధ జిల్లాల్లో బాధితులను అడ్డుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో అనకాపల్లి, కడప, కర్నూలు అనేక జిల్లాల్లో వేలాదిమందికి ఇప్పటికే నోటీసులు ఇచ్చి గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. పది రోజుల క్రితం న్యాయపోరాట దీక్షకు అనుమతి ఇవ్వమని పోలీసులకు విజ్ఞప్తి లేఖ అందించగా చేసుకోండి అని చెప్పారని, మరోవైపు వివిధ జిల్లాల్లో అడ్డుకోవడం... ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే ఆత్మహత్యలు, అసహజ మరణానికి గురైన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు చంద్రబాబు ప్రభుత్వం ఇస్తానని ప్రకటించిన రూ.మూడు లక్షలకు మరో ఏడు లక్షలు కలిపి మొత్తం రూ.10లక్షల పరిహారం పువ్వుల్లో పెట్టి పంపిస్తానని జగన్‌మోహన్ రెడ్డి నాడు ప్రకటించిన మాట నీటి మూటేనా... గత ఐదు సంవత్సరాలుగా ఒక్కరికైనా ఆ విధంగా ఇచ్చారా అని ముప్పాళ్ల ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ సంస్థకు దాదాపు రూ.30వేల కోట్ల ఆస్తులు ఉన్నాయని ప్రకటించిన మంత్రులు, నాటి ముఖ్యమంత్రి ప్రకటనకు సాక్షులుగా ఉన్న పెద్దిరెడ్డి, బొత్స, విజయసాయిరెడ్డి తదితరులందరూ దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే శాంతియుత న్యాయపోరాట దీక్షకు, ఎలాంటి అడ్డంకులు కల్పించకుండా పోలీసులు తోడ్పడాలని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని ముప్పాళ్ల విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు లంకా గోవిందరాజులు, టీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల నిర్బంధం

పోలీసుల అదుపులో తిరుపతిరావు

విశాలాంధ్ర-సింగరాయకొండ: విజయవాడలో గురువారం తలపెట్టిన అగ్రిగోల్డ్ బాధితుల శాంతియుత పోరాట దీక్షకు బయలుదేరిన అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావును ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. సింగరాయ కొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తిరుపతిరావునే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా దీక్షలకు బయలు దేరిన అనేకమంది నాయకులను, బాధితులను ఇళ్ల వద్ద నిర్బంధించారు. నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారు. అగ్రిగోల్డ్ బాధితుల నిర్బంధాన్ని తిరుపతిరావు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు. అధికారం చేపట్టిన ఆరు మాసాల్లోనే సమస్య పరిష్కరిస్తానని నమ్మబలికారన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇస్తామని చెప్పినట్లు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల తరువాత తెలుగుదేశం ప్రభుత్వం కేటాయించిన రూ.250 కోట్లకు రూ.236 కోట్లు కలిపి అందజేశారన్నారు. మళ్లీ 9 రోజులు దీక్షలు చేపట్టగా ఆగస్ట్ 2021లో రూ.20 వేల లోపు మొత్తాలకు రూ.600 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారని తిరుపతిరావు ఆరోపించారు. చివరి ప్రయత్నంగా విజయ వాడ దీక్షకు వెళుతున్న నాయకులు, బాధితులను పోలీసులు ఎక్కడి కక్కడ నిర్బంధించడం దారుణమన్నారు.

వారు నేరస్థులు కాదు...అన్నదాతలు

మధుర స్వామినాథన్ ఆవేదన

న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను నేరస్థులుగా పరిగణించలేమని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న అవార్డు గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె మధుర స్వామినాథన్ అన్నారు. రైతుల నిరసనపై హరియాణా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆమె ఖండించారు. వారు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలని పేర్కొన్నారు. తన తండ్రి ఎంఎస్ స్వామినాథన్‌కు మరణానంతరం భారతరత్న పురస్కార ప్రదానం సందర్భంగా దిల్లీలోని పూసాలో ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. 'పంజాబ్‌కు చెందిన రైతులు పాదయాత్ర చేస్తున్నారు. హరియాణాలో వారి కోసం జైళ్లు సిద్ధమవుతున్నాయి. వారు దిల్లీలోకి ప్రవేశించకుండా బారికేడ్లు నిర్మించారు. ఆందోళనను అడ్డుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే వారు రైతులు మాత్రమే.. నేరస్థులు కాదు. నేను అందరినీ ఒకటే అభ్యర్థిస్తున్నా. మనం అన్నదాతలతో మాట్లాడాలి. ఆందోళనను అణిచి వేసేందుకు ప్రయత్నాలు చేయకుండా పరిష్కార మార్గాలు వెతకాలి' అని మధుర స్వామినాథన్ అన్నారు.

పుల్వామా దాడికి ఐదేళ్లు

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రదాడి జరిగి బుధవారానికి ఐదేళ్లు అయ్యింది. ఈ దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. 2019, ఫిబ్రవరి 14న సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్ జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి గుండా వెళుతుండగా జరిగిన ఈ ఉగ్రదాడి దేశంలోనే అతిపెద్ద దాడుల్లో ఒకటిగా నిలిచింది. పుల్వామా దాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ మెరుపు దాడులు జరిపింది. భారత సైన్యం పాక్ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. నాడు సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌లో అధికంగా బస్సులున్నాయి. పుల్వామా వద్దకు చేరుకోగానే ఓ కారు కాన్వాయ్‌లోని బస్సును ఢీకొంది. ఆ కారులో భారీగా పేలుడు పదార్థాలు ఉన్నాయి. దీంతో పేలుడు సంభవించి 40 మంది జవాన్లు వీరమరణం పొందారు. పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన కఠిన చర్యలతో పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. 2019, ఫిబ్రవరి 26న భారత వైమానిక దళం పాకిస్థాన్‌లోని బాలాకోట్‌లోకి ప్రవేశించి వైమానిక దాడులతో అక్కడి ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసింది. దీంతో ఫిబ్రవరి 27న పాకిస్థాన్ వైమానిక దళం జమ్మూ, కశ్మీర్‌లోకి చొరబడి భారత్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. ప్రతిస్పందనగా జరిపిన దాడుల్లో భారత్‌కు చెందిన యుద్ధ విమానం 'మిగ్-21' పాకిస్థాన్ సైన్యం దాడికి గురై, కూలిపోయింది. 'మిగ్-21' పైలట్ అభినందన్ వర్ధమాన్‌ను పాకిస్తాన్ సైన్యం అదుపులోకి తీసుకుంది. 2019, మార్చి1న అమెరికాతో పాటు ఇతర దేశాల ఒత్తిడి మేరకు అభినందన్ వర్ధమాన్‌ను పాకిస్థాన్ సైన్యం విడుదల చేసింది. పుల్వామా ఉగ్రదాడి వల్ల పాక్‌తో వాణిజ్య సంబంధాలను భారత్ రద్దు చేసుకుంది. ఫలితంగా పాకిస్థాన్ ఆర్థికంగా నష్టపోయింది. పాకిస్థాన్‌ను బ్లాక్‌లిస్ట్ చేసేందుకూ మనీలాండరింగ్‌పై ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)ను కూడా భారత ప్రభుత్వం కోరిన విషయం తెలిసిందే.

రేపటి గ్రామీణ బంద్‌కు సీపీఎం మద్దతు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల క్రితం మోదీ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలని, 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న చలో దిల్లీ మార్చ్‌పై పోలీసులు లాఠీచార్జ్ చేసి రబ్బరు బుల్లెట్లు, భాష్పవాయు గోళాలు ప్రయోగించడాన్ని ఖండించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై సాయుధ బలగాలతో దాడికి పూనుకోవడాన్ని తప్పుపట్టారు. కనీస మద్దతు ధర కల్పిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానం 10 ఏళ్ల తర్వాత కూడా అమలు చేయకుండా రైతులను మోసగించడం అన్యాయమన్నారు. నాడు దిల్లీ రైతు ఉద్యమ సందర్భంగా గిట్టుబాటు ధరల చట్టం తెస్తామని చెప్పి మోదీ ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, దేశ సంపద కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు.

రాజ్యసభ అభ్యర్థుల రెండో సెట్ నామినేషన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ తరపున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు గొల్ల బాబూరావు, వైవీ సుబ్బారెడ్డి, మేడా రఘునాధరెడ్డి బుధవారం రాజ్యసభకు రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే ఒకసారి నామినేషన్లు దాఖలు చేసిన వీరంతా ముందు జాగ్రత్తగా మరో సెట్‌నూ దాఖలు చేశారు. అసెంబ్లీలో ఎన్నికల రిటర్నింగ్ అధికారైన సంయుక్త కార్యదర్శి యం.విజయరాజుకు నామినేషన్ల పత్రాలను ముగ్గురు అభ్యర్థులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీ సుబ్బారెడ్డి, ఉప కార్యదర్శి వనితా రాణి పాల్గొన్నారు.

మరో సర్వే చేశాకే ప్రకటన

లోక్‌సభ అభ్యర్థులపై డీకే శివకుమార్



బెంగళూరు: కర్నాటక నుంచి లోక్‌సభ అభ్యర్థులను మరో సర్వే నిర్వహించిన తర్వాతే ప్రకటిస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. సీఎం సిద్ధరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ కర్నాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలతో పాటు కొందరు నేతలతో బుధవారం బెంగళూరులో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు సమర్పించిన సర్వే నివేదికలపై చర్చించామని డీకే శివ అన్నారు. మరో సర్వే చేయాలని కోరినట్లు తెలిపారు. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తుది జాబితా ఖరారు కాలేదన్నారు. తదుపరి దిల్లీలో సమావేశం కాబోతున్నట్లు వెల్లడించారు.

కన్నీరు తెప్పిస్తున్న వెల్లుల్లి

న్యూఢిల్లీ: వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటాయి. జీడిపప్పు ధరను సవాల్ చేస్తున్నాయి. చత్తీస్‌గఢ్‌లోని వైకుంఠపూర్, మనేంద్రగఢ్, చిర్మిరి, ఖడ్గవాన్ సహా పరిసర ప్రాంతాల్లో కిలో వెల్లుల్లి రూ.400 నుండి రూ.600కు విక్రయిస్తున్నారు. నెల రోజుల క్రితం కిలో వెల్లుల్లి రూ.200కు విక్రయించగా, తరువాత అంతకంతకూ పెరుగుతూవస్తోంది. స్థానిక కూరగాయల వ్యాపారి రాజ్ కుష్వాహ తెలిపిన వివరాల ప్రకారం జనవరిలో కిలో వెల్లుల్లి ధర రూ.200 ఉండగా, ప్రస్తుతం రూ.600 దాటింది. కూరల రుచిని పెంచే వెల్లుల్లి ఇప్పుడు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం జీడిపప్పు ధరతో వెల్లుల్లి ధర పోటీ పడుతోందని వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు. మార్కెట్లో కిలో జీడి పప్పు ధర రూ. 800 నుంచి 1000 మధ్య ఉంటోంది. ప్రభుత్వం వెల్లుల్లి ధరలు నియంత్రించే ప్రయత్నం చేయడం లేదని విమర్శిస్తున్నారు. హోల్‌సేల్‌లో కూడా వెల్లుల్లి కిలో రూ.421 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో రిటైల్ మార్కెట్‌లో వెల్లుల్లి ధర రూ.600 దాటింది. గత శనివారం నుంచి కొత్త వెల్లుల్లి మార్కెట్‌లోకి రావడంతోనే వీటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వెల్లుల్లి ధర ఒక్కసారిగా పెరగడంపై ఈ ప్రాంత రైతు అమిత్ కుమార్ గుప్తా మాట్లాడుతూ గత ఏడాది అధికశాతం రైతులు వెల్లుల్లి సాగు చేశారన్నారు. దీంతో మార్కెట్‌లో వెల్లుల్లి ధర బాగా తగ్గిందన్నారు. దీంతో ఈ ఏడాది రైతులు వెల్లుల్లి సాగు తగ్గించారు. దీంతో మార్కెట్‌లో వెల్లుల్లి కొరత ఏర్పడింది. ఫలితంగా వెల్లుల్లి ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. గత ఏడాది స్థానికంగా వెల్లుల్లి ఎక్కువగా పండడంతో గిట్టుబాటు ధర లభించక రైతులు తమ పంటలను నదులు, కాలువల్లో పడేశారు. గత సంవత్సరం వెల్లుల్లి హోల్‌సేల్ ధర కిలో రూ.40. మార్కెట్ ధర దీని కంటే తక్కువగా ఉంది. దీంతో రైతులు భారీగా నష్టపోయారు. ఫలితంగా రైతులు ఈసారి వెల్లుల్లి సాగు తగ్గించారు.

అన్నాడీఎంకేలోకి నటి గౌతమి

చెన్నై: సినీనటి గౌతమి అన్నాడీఎంకేలో చేరారు. ఆమె చెన్నైలోని గ్రీన్‌వేస్ రోడ్డులో పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామి నివాసానికి వెళ్లారు. అన్నాడీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. దాదాపు 25 ఏళ్ల పాటు బీజేపీలో పనిచేసిన గౌతమి గతేడాది అక్టోబరులో ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పార్టీ కోసం శ్రమించినాగానీ కష్ట సమయంలో తగిన మద్దతు తనకు లభించకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆమె బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు అప్పట్లో ప్రకటించారు. తమిళ నటి గాయత్రి రఘురాం కూడా ఇటీవల అన్నాడీఎంకేలో చేరారు.

అవినీతి రహిత ప్రభుత్వాలు అవశ్యం

వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్‌లో మోదీ

దుబాయ్: నేటి ప్రపంచానికి సమ్మిళితమైన, అవినీతి రహిత ప్రభుత్వాలు అవసరమని ప్రధాని మోదీ నొక్కిచెప్పారు. 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' సిద్ధాంతానికి అనేక సంవత్సరాలుగా కట్టుబడినట్లు తెలిపారు. యూఏఈ పర్యటనలో భాగంగా ఆయన బుధవారం వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ రెండో రోజు సమావేశంలో ప్రసంగించారు. ప్రజా జీవితాల్లో సాధ్యమైనంత తక్కువగా ప్రభుత్వం జోక్యం ఉండాలన్నారు. తమ ప్రభుత్వంపై భారతీయుల నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ ఉద్దేశాలు, నిబద్ధతను విశ్వసిస్తున్నారని చెప్పారు. ప్రజల మనోభావాలకు ప్రాధాన్యత ఇచ్చాము కాబట్టే ఇది సాధ్యమైందని మోదీ అన్నారు. భారత్‌లో అనేక సంస్కరణలు జరిగినట్లు తెలిపారు. పారిశుద్ధ్యం, డిజిటల్ విద్య, బాలికల విద్య వంటివి ప్రస్తావించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఇప్పుడు ప్రధానిగా దాదాపు 23 ఏళ్ల పాలనా అనుభవం తనకు ఉన్నదన్నారు. కనీసం బ్యాంకు ఖాతాలు కూడా లేని 50 కోట్ల మందిని బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానం చేశామని చెప్పారు. నిర్విరామంగా శ్రమిస్తుండటం వల్ల అంతర్జాతీయ స్థాయిలో భారత్ రాణిస్తోందని, ఫిన్‌టెక్, డిజిటల్ చెల్లింపు రంగాల్లో సత్తా చాటుతోందని మోదీ తెలిపారు. ఆధునికత సంతరించుకుంటున్న నేటి ప్రపంచానికి సాంకేతిక ఆధారిత స్మార్ట్ ప్రభుత్వాలు అవసరమని అన్నారు. టెక్నాలజీ, సులభతర జీవనం- న్యాయం, ఆవిష్కరణలు, సులభతర వాణిజ్యం గురించీ మాట్లాడారు. వివిధ రూపాల్లో ఉగ్రవాదం కొత్త సవాళ్లు విసురుతోందని, వాతావరణ మార్పులు విస్తృతంగా ఎదురవుతున్నాయన్నారు. ప్రాదేశిక, అంతర్జాతీయ సమస్యలు కూడా ఈ సవాళ్లకు తోడవుతున్నాయని చెప్పారు. దుబాయ్‌ను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు, వాణిజ్యం, సాంకేతికకు కేంద్రంగా వర్ణించారు. యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను విజన్‌గల నాయకుడని ప్రశంసించారు. మోదీ పర్యటనలో భాగంగా వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ మౌలిక వసతులు, ఫిన్‌టెక్ తదితర రంగాలలో ఎనిమిది ఒప్పందాలు జరిగాయి.

అబుదాబీలో హిందూ ఆలయం ప్రారంభం

అబుదాబీ: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని నగరం అబుదాబీ సమీపంలో నిర్మించిన తొలి హిందూ ఆలయాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బోచాసనవాసీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఆలయాన్ని ప్రారంభించారు. అర్చకులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవతలకు హారతిచ్చారు. తనను కలిసేందుకు వచ్చిన భారత పౌరులకు అభివాదం చేశారు. బాలీవుడు నటుడు అక్షయ్ కుమార్, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దుబాయ్ - అబుదాబీ మార్గంలోని షేక్ జాయెద్ హైవే పక్కన ఈ ఆలయాన్ని నిర్మించారు. యూఏఈ ప్రభుత్వమిచ్చిన 27 ఎకరాల భూమిలో 2019లో నిర్మాణాన్ని ప్రారంభించగా రాజస్థాన్, గుజరాత్‌ల నుంచి వచ్చిన నిపుణులు మూడేళ్లు శ్రమించి దీనిని నిర్మించారు. దుబాయ్‌లో మూడు ఆలయాలున్నా, అబుదాబీ మందిరం గల్ఫ్ ప్రాంతంలోనే అతి పెద్దది. అరబ్ ఎమిరేట్స్‌లోని ఏడు ఎమిరేట్లకు ప్రతీకగా ఈ ఆలయానికి ఏడు గోపురాలుంటాయి. రాజస్థాన్ పాలరాయిని నిర్మాణంలో వినియోగించారు. రూ.700 కోట్లతో ఆలయాన్ని నిర్మించారు. గుడికి రెండు వైపులా భారత్ నుంచి తీసుకెళ్లి గంగా, యమునా నదీజలాల ప్రవాహాన్ని ఏర్పాటు చేశారు. ఇది వారణాసి ఘాట్లను తలపించేలా ఉంది.

వలంటీర్లకు ఎన్నికల విధులు అప్పగించొద్దు

కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల విధుల్లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పాత్రపై ఎన్నికల సంఘం (ఈసీ) స్పందించింది. వాలంటీర్లకు ఎట్టి పరిస్తితుల్లోనూ ఎన్నికల విధులు అప్పగించొద్దని స్పష్టం చేసింది. అభ్యర్థులకు పోలింగ్ ఏజెంట్లుగానూ వాలంటీర్లను అనుమతించొద్దని తెలిపింది. ఓటర్ల వేలుకు ఇంకు పూసే విధులు మాత్రమే వారికి అప్పగించాలని స్పష్టం చేసింది. ముఖ్యమైన ఎన్నికల పనులేవీ వారికి ఇవ్వొద్దని స్పష్టం చేసింది. ఎన్నికల విధుల్లోకి గ్రామ, వార్డు, సచివాలయ సిబ్బందిని తీసుకునేందుకు అభ్యంతరం లేదంటూ.. సీఈవోకు సూచనలు చేస్తూ ఈసీ లేఖ రాసింది. బీఎల్‌వోలుగా పనిచేసిన సిబ్బందిని పోలింగ్ విధుల్లోకి తీసుకోవద్దని.. వారికి పోలింగ్ రోజు ఇతర పనులు అప్పగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని పేర్కొంది. ఈసీ సూచనలతో కలెక్టర్లు, అధికారులకు సీఈవో లేఖ రాశారు.

బీజేపీ ఎమ్మెల్యేకు జ్యుడీషియల్ రిమాండ్

థానే: పోలీస్‌స్టేషన్‌లో శివసేన నాయకుడిపై కాల్పులు జరిపిన బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ కు థానే జిల్లా కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఫిబ్రవరి 2న ఉల్హాస్ నగర్‌లోని హిల్‌లైన్ పోలీస్‌స్టేషన్‌లో శివసేన కళ్యాణ్ యూనిట్ అధ్యక్షుడు మహేష్ గైక్వాడ్‌పై బీజేపీ ఎమ్మెల్యే కాల్పులకు తెగబడ్డాడు. ఈ కేసులో నిందితులపై హత్యాయత్నం, వివిధ ఇతర అభియోగాల కింద కేసులు నమోదు చేశారు. సేననేతను థానేలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. నిందితులు ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్, అతని సహచరులు హర్షల్ కెనె, సందీప్ సర్వాంకర్, విక్కీ గణత్రా డ్రైవర్ రంజిత్ యాదవ్‌లకు విధించిన పోలీసు కస్టడీ ముగియడంతో బుధవారం కోర్టులో హాజరుపరిచారు. నిందితుల తరపు న్యాయవాదులు నీలేష్ పాండే, ఉమర్ కాజీలు విలేకరులతో మాట్లాడుతూ విచారణ కోసం నిందితుల రిమాండ్‌ను పొడిగించాలని పోలీసులు అభ్యర్థించగా, కోర్టు అనుమతించలేదని తెలిపారు. వారిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేశారన్నారు.

సివిల్స్ నోటిఫికేషన్ జారీ

- మే 26న ప్రిలిమినరీ
- అక్టోబరు 19న మెయిన్స్ పరీక్ష

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శుభవార్త. అఖిల భారత సర్వీసుల్లో 1,056 ఉద్యోగాల భర్తీకి సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2024కు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ)బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో విడుదల చేసిన క్యాలెండర్‌కు అనుగుణంగానే ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ ఇచ్చింది.

ఈ పరీక్షకు నేటి నుంచి మార్చి 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష మే 26న, మెయిన్స్ అక్టోబర్ 19న నిర్వహించనున్నారు. దీంతో పాటు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో 150 పోస్టులకు విడిగా నోటిఫికేషన్ ఇచ్చింది. సివిల్స్ నోటిఫికేషన్‌లో ముఖ్యాంశాలను పరిశీలిస్తే... అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విద్యాసంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలి. అభ్యర్థుల వయసు 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ఆయా వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా మినహాయింపు ఉంది. ఓబీసీ, ఇతర అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ.100 (మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు మినహాయింపు) చెల్లించాలి. ప్రిలిమినరీ పరీక్షలో ప్రశ్నలు ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటాయి. ఈ ప్రశ్నల్లో నెగెటివ్ మార్కులు కూడా ఉంటాయి. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులను మెయిన్స్ రాసేందుకు అనుమతిస్తారు.

మెయిన్స్ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఇంటర్వ్యూ నిర్వహించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, హైదరాబాద్, వరంగల్‌గా నిర్ణయించారు. మెయిన్స్ పరీక్ష కేంద్రాలుగా హైదరాబాద్, విజయవాడలో ఏర్పాటు చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.